# తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 112 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజీలు : 08 సోమవారం 23 - 11 - 2026వెల రూ. 2 రూ/


## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

- కొత్త మార్గదర్శకాలు, అర్హులు ఎవరు?
- ప్రతి రేషన్ కార్డుకు ఒకరి చొప్పున రూ.5 లక్షల జీవిత బీమా
- 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న వారు దరఖాస్తుకు అర్హులు
- డిసెంబర్ 18 వరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక శిబిరాలు
- ప్రభుత్వమే పూర్తి ప్రీమియం చెల్లిస్తుందని స్పష్టీకరణ



**హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' అమలుకు సంబంధించి సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద అర్హత కలిగిన ప్రతి కుటుంబంలో ఒకరికి రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనుండగా, ప్రతి రేషన్ కార్డుకు ఒకరు మాత్రమే ఈ బీమాకు అర్హులని ప్రభుత్వం స్పష్టం చేసింది.దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ బీమాకు సంబంధించిన పూర్తి ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించనుంది. కుల, మత, ఆదాయ భేదాలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఒక కోటి నుండి 1.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ప్రణాళికా విభాగం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం, రేషన్ కార్డు సంఖ్యనే దరఖాస్తు సంఖ్యగా పరిగణిస్తారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ప్రాధాన్యతనిస్తూ, 18 నుండి 59 ఏళ్ల మధ్య వయసున్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వయసు నిర్ధారణ కోసం ఆధార్ కార్డులోని పుట్టిన తేదీనే ప్రామాణికంగా తీసుకుంటారు. ఆధార్ వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే, దరఖాస్తు ప్రక్రియకు ముందే వాటిని సరిచేయించుకోవాలని అధికారులు సూచించారు.నమోదు ప్రక్రియ నవంబర్ 19న ప్రారంభమై డిసెంబర్ 18 వరకు కొనసాగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ - మిగతా 2 లో



## సిద్ధిపేట 'సదర్'లో హరీశ్ రావు జోష్

- సిద్ధిపేటలో ఘనంగా నిర్వహించిన సదర్ వేడుక
- సందడి చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు
- త్వరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా
- సర్వేలు సైతం బీఆర్ఎస్ పునరాగమనాన్ని స్పష్టం చేస్తున్నాయన్న నేత
- సోషల్ మీడియాలో సదర్ ఫొటోలను పంచుకున్న హరీశ్ రావు

**హైదరాబాద్ :**

సిద్ధిపేట పట్టణంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొని సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ వేడుకల్లో ఆయన యాదవ సోదరులతో కలిసి ఉత్సాహంగా - మిగతా 2 లో

## ముక్త్ నషా ఈవెంట్ కు ప్రభాస్ ను ఆహ్వానించిన కిషన్ రెడ్డి



- ప్రత్యేక టీషర్ట్‌ల ఆవిష్కరణ
- ప్రభాస్‌తో భేటీ అయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానం
- 'హైదరాబాద్ వాక్స్' ప్రచార టీషర్ట్‌లను ఆవిష్కరించిన ప్రభాస్
- మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం గళమెత్తాలని పిలుపు

**హైదరాబాద్ :**

చేపడుతున్న 'నషా ముక్త్ భారత్' ఉద్యమంలో దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భాగస్వామ్యం కావాల్సిందిగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు ఆహ్వానం - మిగతా 2 లో

## అగ్నివీరుల పెళ్లికి గ్రీన్‌సిగ్నల్



- రెండేళ్ల సర్వీసు పొడిగింపును ఎంచుకునే అగ్నివీరులు వివాహం
- అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది

**అమరావతి :**

అగ్నిపథ్ కింద దేశసేవలో నిమగ్నమైన అగ్నివీరులకు ఊరటనిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రెండేళ్ల సర్వీసు పొడిగింపును ఎంచుకునే అగ్నివీరులు వివాహం చేసుకోవటానికి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే దానికి ఓ షరతు విధించింది. 2022లో ప్రారంభమైన అగ్నిపథ్ పథకం నిబంధనల ప్రకారం మొదటి నాలుగేళ్ల సర్వీసుకాలంలో అగ్నివీరులు వివాహం చేసుకోవటానికి వీల్లేదు. రెండోదశ సర్వీసులో చేరి సుమారు 4 వారాలపాటు సాగే ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న వారికే వివాహం చేసుకోవటానికి అనుమతి లభిస్తుంది. అగ్నిపథ్ పథకం ఎప్పటికప్పుడు మార్పులు చెందుతుందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ - మిగతా 2 లో

## చైనా బార్డర్‌లోని 40 గ్రామాల్లో జనాభా పెరిగింది

- వలసలు ఆగిపోయాయ్: అమిత్ షా
- కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సరిహద్దు రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌కు తగినన్ని నిధులు కేటాయించలేదని కేంద్ర మంత్రి అమిత్ షా ఆరోపించారు

**ఢిల్లీ :**

అరుణాచల్ ప్రదేశ్‌లోని చైనా సరిహద్దులో ఉన్న 40 గ్రామాల్లో జనాభా పెరిగిందని, వలసలు ఆగిపోయాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అక్కడ ఉపాధి, ఆరోగ్య సౌకర్యాలు కల్పించిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో అరుణాచల్ ప్రదేశ్‌లో అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. ఆ రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ ఈశాన్య రాష్ట్ర పురోగతి కోసం గణనీయంగా నిధులను పెంచిందని పేర్కొన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనలో ఉన్న అమిత్ షా ఇటానగర్‌లో జరిగిన సహకార సదస్సులో ఈ మేరకు మాట్లాడారు. - మిగతా 2 లో





## ఐఐటీతో సమానంగా ఐటీఐకి గౌరవం దక్కాలి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- వృత్తి విద్యపై సమాజం దృక్పథం మారాలి
- ఐటీఐ విద్యార్థులు ఆత్మన్యూనతకు గురికావద్దు
- పరిశ్రమలకు నైపుణ్యం గల కార్మికులే అసలైన బలం
- ఏఐ వచ్చినా నైపుణ్యం ఉన్నవారికి ఉపాధి భద్రత
- 2027లో గ్రేటర్ నోయిడాలో వరల్డ్ స్కిల్స్ పోటీలు

**ఢిల్లీ :**

లక్నోలోని గోమతి నగర్ ఇందిరా గాంధీ ప్రతిష్ఠాన్‌లో శనివారం జరిగిన 5వ కౌశల్ దీక్షాంత్ సమారోహ్ (జాతీయ నైపుణ్య స్నాతకోత్సవం)లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని వృత్తి విద్య ప్రాముఖ్యతను చాటిచెప్పారు.పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో (ఐటీఐ) సాంకేతిక శిక్షణ పొందే విద్యార్థులకు యూనివర్సిటీ, కళాశాల - మిగతా 2 లో

## పంచాయతీ ఎన్నికల్లో పంతాలకు పోవద్దు

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం
- పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- స్థానిక సంస్థల ఫలితాలు ప్రజాభిప్రాయానికి నిదర్శనమన్న సీఎం చంద్రబాబు
- పంచాయతీల్లో ఏకగ్రీవాల కోసం గ్రామ నేతలతో మాట్లాడాలని ఎమ్మెల్యేలకు సూచన
- ఏకగ్రీవ పంచాయతీలకు జనాభాను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు
- పార్టీ నేతల మధ్య పంతాలు వీడి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను విస్తృతంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో తాజాగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, ఏకగ్రీవాల ఆవశ్యకత తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు.టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఇటీవల పార్టీ గుర్తులపై జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన ఆమోదమని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఈ ఏకపక్ష ప్రజాభిప్రాయాన్ని ప్రతిపక్ష వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన విమర్శించారు. పార్టీ ప్రాతిపదికన జరిగిన పోరు ముగిసిందని, ఇక గ్రామాల్లో - మిగతా 2 లో



## కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ఐఐటీలతో సమానంగా ఐటీఐలకు గుర్తింపు దక్కాలన్న లోకేశ్
- ప్రధాని మోదీ పోస్టుకు ఏపీ విద్యాశాఖ మంత్రి మద్దతు
- ఏఐ కాలంలో టెక్నికల్ నైపుణ్యాలకే అధిక విలువ
- జర్మనీ పరిశ్రమల అనుభవాన్ని ప్రస్తావించిన లోకేశ్

**అమరావతి :**

ఐఐటీ విద్యార్థులతో సమానంగా ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) విద్యార్థులకూ సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా చేసిన - మిగతా 2 లో

## పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ




- ఎవరైనా పోటీ చేయవచ్చు
- పంచాయతీ ఎన్నికల్లో పోటీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ప్రకటన
- పార్టీ శ్రేణులు ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు వేయవచ్చని స్పష్టీకరణ
- పోటీ చేయాలనుకునే వారిని నాయకులు ఎవరూ అడ్డుకోవద్దని ఆదేశం
- పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి సీట్ల పంపకాలు ఉండవని వెల్లడి
- స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్నికలు జరగాలని పిలుపు

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
సోమవారం 23 - 11 - 2026

# సంపాదకీయం

## గురిలేని విఫల ఉరిశిక్షలు




న్యాయాధికారం అనే ముసుగులో మనిషి ప్రాణాలు తీయడం అంటే, రాజ్యం తాను ఏ హింసనైతే ఖండిస్తోందో, తిరిగి అదే హింసను అనుసరించడమే! ఉరిశిక్షలను చట్టబద్ధం చేయడం ద్వారా రాజ్యం తిరిగి వెనక్కి తీసుకోలేని నైతిక హద్దును దాటుతోంది.మరణశిక్షల నైతిక, న్యాయబద్ధతల విషయం గతవారం ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో మరోసారి చర్చకు వచ్చింది. మరణశిక్షలను పూర్తిగా రద్దు చేయాలని, ప్రపంచవ్యాప్తంగా ఉరిశిక్షల అమలు మీద తాత్కాలిక నిషేధం విధించాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానానికి 133 సభ్యదేశాలు అనుకూలంగా ఓటు వేసినా, భారతదేశం మరో 32 దేశాలతో కలిసి ఈ తీర్మానాన్ని వ్యతిరేకించింది. అత్యంత అరుదైన కేసులలో చట్టబద్ధమైన ప్రక్రియకు లోబడి మాత్రమే మరణశిక్షలు విధిస్తున్నామని న్యూఢిల్లీ సమర్థించుకుంది. చట్టవిరుద్ధమైన హత్యలకు, న్యాయస్థానాలు విధించే మరణశిక్షలకు మౌలికమైన తేడా ఉందని ఐరాస వేదికపై భారత్ వాదించినప్పటికీ, చట్టం ముసుగులో మనుషుల ప్రాణాలను తీసే ఈ వైఖరిపై మానవ హక్కుల దృక్పథం నుంచి వెలువడుతున్న విమర్శలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఒక వ్యక్తి ప్రాణాలను తీసే నైతిక లేదా సార్వభౌమ అధికారం రాజ్యానికి లేదు. న్యాయాధికారం అనే ముసుగులో మనిషి ప్రాణాలు తీయడం అంటే, రాజ్యం తాను ఏ హింసనైతే ఖండిస్తోందో, తిరిగి అదే హింసను అనుసరించడమే! ఉరిశిక్షలను చట్టబద్ధం చేయడం ద్వారా రాజ్యం తిరిగి వెనక్కి తీసుకోలేని నైతిక హద్దును దాటుతోంది.భవిష్యత్తులో జరిగే ఘోర నేరాలను ఉరికంబం భయం నిరోధిస్తుందని మరణశిక్షల సమర్థకులు తరచూ వాదిస్తుంటారు. కానీ గణాంకాలను పరిశీలిస్తే ఈ వాదన భారతదేశం విషయంలో పూర్తిగా తప్పు అని అర్థమవుతుంది.2016 నుంచి 2025 మధ్యకాలంలో, దేశంలోని సెషన్స్ కోర్టులు దాదాపు 1,310 మందికి మరణశిక్షలు విధించాయని జాతీయ నేర గణాంకాల బ్యూరో చెబుతోంది.ఇలా శిక్షల విధింపులో భారీ పెరుగుదల కనిపిస్తున్నప్పటికీ ఆ పదేళ్లలో వాస్తవంగా అమలైన ఉరిశిక్షలు కేవలం నాలుగు మాత్రమే. 2012 నాటి నిర్భయ కేసులో నలుగురు దోషులకు 2020 మార్చిలో ఉరిశిక్షలు అమలు చేశారు. అంతకుముందు 2012లో అజ్మల్ కసబ్, 2013లో అఫ్జల్ గురు, 2015లో యాకూబ్ మెమన్‌ల ఉరిశిక్షలను కలుపుకున్నా, గత రెండు దశాబ్దాలకు పైగా కాలంలో మన దేశం పది కన్నా తక్కువ మందినే ఉరితీసింది. ఆచరణలో దాదాపు అమలు కాని, ఏళ్ల తరబడి అప్పీళ్ల ప్రక్రియలో జాప్యం జరిగే, ఈ శిక్ష ఎంతవరకు సమర్థమైన నేర నిరోధకమో అర్థం కాదు.అజ్మల్ కసబ్, నిర్భయ దోషుల వంటి సంచలన కేసులలో ఉరిశిక్షలు అమలు చేసినప్పటికీ, అవి అలాంటి నేరాలను ఆపలేకపోయాయి అనేందుకు స్పష్టమైన దాఖలాలు ఉన్నాయి. 26/11 ముంబైలో ఉగ్రదాడులకు గాను 2012లో కసబ్‌ను ఉరితీయడం వల్ల సరిహద్దు ఆవలి ఉగ్రవాద నెట్‌వర్క్‌లు ఆగిపోలేదు, భారత గడ్డపై ఉగ్రదాడులూ తగ్గలేదు. అదేవిధంగా, 2012 నిర్భయ విషాదం తర్వాత వెల్లువెత్తిన ప్రజాగ్రహంతో తీవ్రమైన లైంగిక నేరాలకు మరణశిక్షలను విస్తరిస్తూ చట్టసవరణలు చేశారు. చివరకు 2020లో ఆ నలుగురు దోషులను ఉరితీశారు. అయినప్పటికీ, దేశవ్యాప్తంగా లైంగిక హింసలో తగ్గుదల కనిపించలేదు. జాతీయ నేర గణాంక బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం, ఒక్క 2024లోనే భారతదేశంలో 29,536 అత్యాచార కేసులు నమోదయ్యాయి.దేశంలో ప్రతి 71 సెకన్లకు మహిళలపై ఏదో ఒక నేరం నమోదవుతోంది. లైంగిక దాడుల కేసులలో మరణశిక్షలను విస్తరించడం వల్ల నేరస్థులు భయపడటానికి బదులు, ఏకైక సాక్షి అయిన బాధితురాలిని సైతం హత్య చేసి ఆధారాలు చెరిపివేసే ప్రమాదకర ధోరణి పెరుగుతోంది. మరోవైపు, తిరిగి సరిదిద్దలేని మరణశిక్షను విధించడానికి న్యాయమూర్తులు వెనుకాడటం వల్ల నేర నిరూపణ రేటు మరింత పడిపోతోంది.ఒక నేరస్థుడి ఉనికి ఒక మహిళ ప్రాణాలకు, శారీరక స్వేచ్ఛకు నిరంతర ముప్పుగా పరిణమించినప్పుడు, సమాజం నుంచి అత్యంత కఠినమైన స్పందన రావాలి. ఆ స్పందన ప్రతీకార చర్యలకు గాక, మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇచ్చేదిగా ఉండాలి. ఉరికంబం చుట్టూ తిరిగే ప్రతీకాత్మక రాజకీయాలను పక్కనపెట్టి, వ్యవస్థాగత సంస్కరణల దిశగా విస్తృత స్థాయి విధానపరమైన చర్చ జరగాలి. శిక్షల తీవ్రత కంటే, నేరం చేస్తే తప్పకుండా వెంటనే శిక్ష పడే పరిస్థితి ఉండటమే అసలైన నేర నిరోధకంగా పనిచేస్తుంది.ఇందుకోసం మందకొడిగా సాగే పోలీసు దర్యాప్తులను సమూలంగా ప్రక్షాళన చేయాలి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను విస్తరించాలి. లైంగిక దాడుల విచారణలో నేర నిరూపణ రేటును పెంచాలి. సంస్కరణకు ఏ మాత్రం అవకాశం లేని కరుడుగట్టిన నేరస్థులకు ముందస్తు విడుదలకు వీలులేని కఠిన యావజ్జీవ కారాగార శిక్షను అమలు చేయాలి. నమోదైన అత్యాచార కేసులలో 96.8శాతం మంది నిందితులు బాధితులకు తెలిసినవారేనని ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాబట్టి ఇళ్లలోనూ సమాజంలోనూ మహిళలను అభద్రతకు గురిచేస్తున్న పితృస్వామ్య ఆధిపత్య భావజాలం, సామాజిక కట్టుబాట్లు, వ్యవస్థాగత వైఫల్యాలపై విధాన నిర్ణేతలు దృష్టి సారించాలి, మగపిల్లల పెంపకంలో మార్పు తేవాలి.మానవీయ విలువలను, హక్కులను గౌరవించే ఒక పరిణతి చెందిన ప్రజాస్వామ్యం, ఒక వ్యక్తి ప్రాణం తీసే స్థాయికి దిగజారకుండానే ప్రమాదకర నేరస్థులను శాశ్వతంగా సమాజానికి దూరం చేసి కట్టడి చేయగలదు.

## పంచాయతీ ఎన్నికల్లో జనసేన శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసేన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ పూర్తి స్వేచ్ఛనిచ్చారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా ఎలాంటి రాజకీయపరమైన అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలవవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకొచ్చే జనసేన శ్రేణులను పార్టీలోని నాయకులు ఎవరూ అడ్డుకోకూడదని పవన్ కల్యాణ్ కరాఖండిగా ఆదేశాలు జారీ చేశారు. స్థానిక స్థాయిలో ప్రజాసేవ చేయాలనే ఆసక్తి, ప్రజల మద్దతు ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం దక్కాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు.మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి స్థానాల పంపకాలు (సీట్ల సర్దుబాటు) ఉండవని పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జరిగే ఎన్నికలని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలో పోటీ చేయాలనుకునే ప్రతి పౌరుడికి నామినేషన్ దాఖలు చేసే పూర్తి హక్కు ఉంటుందన్నారు.జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తుందని, రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాపూరిత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు.

## ముక్త్ నషా ఈవెంట్ కు ప్రభాస్ ను ఆహ్వానించిన కిషన్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి -** అందింది. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి నేడు ప్రభాస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇవాళ హైదరాబాద్‌లో ప్రభాస్ నివాసానికి వెళ్లిన ఆయన.. కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా నిర్వహిస్తున్న డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సమాజంలో, ముఖ్యంగా యువతలో డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రభాస్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంయుక్తంగా 'హైదరాబాద్ వాక్స్ -- నషా ముక్త్ భారత్' కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక టీషర్ట్‌లను ఆవిష్కరించారు.దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలనే ప్రధాన సందేశాన్ని ఈ ప్రచారం చాటిచెబుతోంది. ఈ సందర్భంగా "మాదకద్రవ్యాల రహిత భారత్ కోసం మనమందరం గళమెత్తుదాం!" అంటూ పిలుపునిచ్చారు. యువతలో విపరీతమైన అభిమానం ఉన్న ప్రభాస్ వంటి అగ్ర నటుడు ఈ అవగాహన ఉద్యమానికి మద్దతు తెలపడం ద్వారా సమాజంలో మరింత సానుకూల ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

## సిద్ధిపేట 'సదర్'లో హరీశ్ రావు జోష్

**మొదటిపేజీ తరువాయి -** పాలుపంచుకున్నారు. స్థానిక ప్రజలు, యువతతో మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో హరీశ్ రావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తలపాగా ధరించి, చేతిలో హాకీ బ్యాట్ పట్టుకుని పైకెత్తుతూ యువతతో కలిసి జోష్ ప్రదర్శించారు. తనకు బహూకరించిన కత్తిని గాల్లోకి దూశారు. సిద్దిపేటలో జరిగిన ఈ సదర్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.ఉత్సవాల అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పలు సర్వేలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు.ఇదే సమయంలో సిద్దిపేట రాజకీయాల ప్రస్తావన రావడంతో వేదికపై సవాళ్లు, ప్రతిసవాళ్లు చోటుచేసుకున్నాయి. స్థానిక అభివృద్ధిపై ఎవరైనా చర్చకు రావచ్చంటూ నాయకులు ఒకరికొకరు సవాళ్లు విసురుకోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఏదేమైనా, సంప్రదాయ ఉత్సవాలను ప్రజలంతా కలిసికట్టుగా, ఉల్లాసంగా జరుపుకోవడం అభినందనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో పంతాలకు పోవద్దు

**మొదటిపేజీ తరువాయి -** అభివృద్ధి ధ్యేయంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ అదే విజయ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.పంచాయతీలు పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయని, కాబట్టి అక్కడ రాజకీయ ఘర్షణలకు తావులేకుండా ఏకగ్రీవాలు జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామాలు ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక నజరానాలు అభివృద్ధి పనులకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. గతంలో కనీస నజరానా రూ.5 లక్షలుగా ఉంటే దానిని ఇప్పుడు రూ.15 లక్షలకు, గరిష్ఠ నజరానాను రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆదేశించారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5 వేల నుంచి 10 వేల మధ్య



జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షల ప్రోత్సాహకం అందుతుందని ఆయన గుర్తుచేశారు.గ్రామ స్థాయిలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు తీవ్ర పట్టుదలతో ఉంటారని, అటువంటి చోట్ల నేతలతో సంప్రదింపులు జరపాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. నాయకుల మధ్య పంతాలు, వ్యక్తిగత పట్టింపులకు తావులేకుండా ఐక్యతను ప్రదర్శించాలని సూచించారు. జడ్పీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రత్యర్థి పార్టీ పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని పేర్కొన్న సీఎం, అదే సమయంలో తమ పార్టీలోని నేతలే రెండు వర్గాలుగా విడిపోయి పోటీపడే పరిస్థితి రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ, గ్రామాల సమగ్ర వికాసానికి ఏకగ్రీవాలే మార్గమని ప్రజలను ఒప్పించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## అగ్నివీరుల పెళ్లికి గ్రీన్‌సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి -** ఎన్.ఎస్.రాజా సుబ్రమణి ఇటీవల పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ వివాహ నిషేధం ఎత్తివేత యువ సైనికుల వ్యక్తిగత, సామాజిక ఆకాంక్షలకు ఊరటనిచ్చింది.అగ్నివీర్‌ల సేవా కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తున్నట్లు కేంద్ర మంత్రివర్గం ఇటీవల పేర్కొంది. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ కింద నాలుగేళ్ల ప్రాథమిక పదవీ కాలం ముగిసిన తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మంది అగ్నివీర్‌లకు అదనంగా మరో రెండేళ్లపాటు సేవలు అందించే అవకాశం కల్పిస్తామని ప్రకటించింది. ఈ అదనపు రెండేళ్ల పొడిగింపు గడువు పూర్తైన తర్వాత ఆసక్తి గల అగ్నివీర్‌లు సాయుధ దళాల్లో చేరవచ్చని తెలిపింది. ఈ మేరకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (జఃఖా) జనరల్ ఎన్. ఎస్. రాజా సుబ్రమణి వివరాలు వెల్లడించారు. వాస్తవానికి, ప్రతిభ ఆధారంగా 25శాతం మంది అగ్నివీర్‌లను రక్షణ దళాల్లో (రెగ్యులర్ ఫోర్సెస్) చేర్చుకొని, మిగిలిన 75శాతం మంది అగ్నివీర్‌లను క్రమశిక్షణ కలిగిన, ఉత్సాహవంతులైన యువకులుగా తిరిగి సమాజంలోకి పంపేది. కానీ, అగ్నిపథ్‌ను సవరించన కేంద్రం, ఆ 75 శాతం అగ్నివీర్‌లకు అదనంగా మరో రెండేళ్ల పాటు సైన్యంలో పనిచేసే చేసే అవకాశం కల్పించింది. రెండేళ్ల కాలం పూర్తైన తర్వాత ఆసక్తి ఉన్న వారందరినీ నిర్దిష్ట ఎంపిక ప్రమాణాలకు లోబడి సాయుధ దళాల్లో చేర్చుకోనుంది.కాగా, 2022 జూన్ 14న అగ్నిపథ్ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పట్లోనే అగ్నివీర్‌ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని, ఈ పథకాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని తెలిపింది. అయితే, మొదటి బ్యాచ్ అగ్నివీర్‌ల నాలుగేళ్ల పదవీ కాలం ముగింపు దశకు చేరుకున్న తరుణంలో, నాలుగేళ్లలో సర్వీసులో వారి పనితీరుపై కేంద్రం సానుకూలంగా స్పందించి ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు త్రివిధ దళాల్లో బలగాల కొరతను భర్తీ చేసేందుకు రానున్న రోజుల్లో అగ్నివీరుల నియామకాలను పెంచే యోచనలో భారత సైన్యం ఉన్నట్లు సమాచారం. అయితే, విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## కార్మికులను ఎంత గౌరవిస్తారో నాకు తెలుసు

**మొదటిపేజీ తరువాయి -** పోస్టుకు లోకేశ్ స్పందిస్తూ, ఈ ముఖ్యమైన విషయాన్ని లేవనెత్తినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శకంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన ఫ్యాక్టరీ వర్క్‌ఫోర్స్‌కు ఉద్యోగావకాశాలు, ప్రాధాన్యత భారీగా పెరుగుతాయని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నేను యువకుడిగా ఉన్నప్పుడు జర్మనీలోని ఆటోమొబైల్ ఫ్యాక్టరీలలో ఇంటర్న్‌షిప్ చేశాను. అక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంతగా గౌరవిస్తారో నేను స్వయంగా చూశాను. ఆ నైపుణ్యాలకు ఇచ్చే గౌరవమే జర్మనీ ప్రపంచంలోనే అత్యుత్తమ తయారీ రంగ కేంద్రంగా ఎదగడానికి ప్రధాన కారణమైంది. మన దేశంలో కూడా ఐటీఐలపై ఉన్న చిన్నచూపును తొలగించి, నైపుణ్యంతో కూడిన పనులపై గౌరవమర్యాదలు తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని లోకేశ్ వివరించారు.రాబోయే రోజుల్లో తయారీ, పారిశ్రామిక రంగాలలో సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం గణనీయంగా పెరుగుతుందని ఆయన తెలిపారు. సాధారణ విద్యా కోర్సులతో సమానంగా వృత్తి విద్యా కోర్సులకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఐటీఐ విద్యార్థుల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం ఏర్పడినప్పుడే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తమ వృత్తి పట్ల వారు మరింత గర్వపడే వాతావరణం ఏర్పడుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు.ం

## ఐఐటీతో సమానంగా ఐటీఐకి గౌరవం దక్కాలి

**మొదటిపేజీ తరువాయి -** విద్యార్థులతో సమానమైన గుర్తింపు దక్కాలని, వృత్తి విద్య పట్ల సమాజం దృక్పథం మారాలని ఆయన పిలుపునిచ్చారు. సంప్రదాయ డిగ్రీలకు మాత్రమే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ధోరణి వల్ల చాలామంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఐటీఐలో చదువుతున్న విషయాన్ని బంధుమిత్రులకు చెప్పేందుకు ఇప్పటికీ సంకోచిస్తున్నారని, దాచిపెడుతున్నారని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు.యూనివర్సిటీకి కాకుండా చేతిపనులు, సాంకేతిక శిక్షణలో ఉన్నారన్న కారణంతో ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఐఐటీ విద్యార్థులకు దక్కే గౌరవమే ఐటీఐ విద్యార్థులకూ లభించాలని, ఆ రెండు సంస్థలూ దేశానికి ఆస్తి, బలం, భవిష్యత్తు అని ప్రధాని ఉద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ హాజరైన ఈ వేడుకలో 52 మంది జాతీయ స్థాయి టాపర్లను సత్కరించారు.పెద్ద పెద్ద కంపెనీల బలం కేవలం డిగ్రీలు ఉన్న కొద్దిమంది ఉద్యోగులతోనే కాకుండా, నిత్యం పనులు నడిపించే వందలాది మంది ఐటీఐ శిక్షణ పొందిన కార్మికులపై ఆధారపడి ఉంటుందని ప్రధాని వివరించారు. ఒక సంస్థలో యూనివర్సిటీ పట్ట ఉన్నవారు కొద్దిమందే ఉండొచ్చని, కానీ దాని కార్యకలాపాలు సజావుగా సాగడానికి నైపుణ్యం గల శ్రామిక శక్తే వెన్నెముకగా నిలుస్తుందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలోనూ, చేతిలో నైపుణ్యం ఉన్నవారి ఉపాధిని ఎవరూ లాక్కోలేరని మోదీ భరోసా ఇచ్చారు.ఈ స్నాతకోత్సవాన్ని అద్భుతంగా నిర్వహించిన కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి, ఆయన బృందాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థుల వేషధారణ, నడవడిక, ఆత్మవిశ్వాసం సంప్రదాయ యూనివర్సిటీ స్నాతకోత్సవాల్లోనూ ప్రత్యేకంగా నిలిచేలా ఉన్నాయని కొనియాడారు. 2027లో గ్రేటర్ నోయిడా వేదికగా భారత్ ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ స్కిల్స్' పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుందని ఈ సందర్భంగా ప్రధాని ప్రకటించారు.ఉన్నత విద్యకు వెళ్లలేని విద్యార్థులకు మాత్రమే ఐటీఐ కోర్సులు ప్రత్యామ్నాయం అనే భావన వీడాలని ప్రధాని సూచించారు. ఉపాధి, సాంకేతిక నైపుణ్యం, పరిశ్రమల్లో ఉజ్వల కెరీర్‌కు ఐటీఐ శిక్షణ అత్యంత కీలక మార్గమని ఆయన స్పష్టం చేశారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న వేళ, పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా నైపుణ్యం కలిగిన యువతను తీర్చిదిద్దడంతో పాటు వారికి తగిన సామాజిక గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందని మోదీ ప్రసంగం చాటిచెప్పింది.

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

**మొదటిపేజీ తరువాయి -** పంచాయతీ స్థాయిలో, పట్టణాల్లో వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో ఈ శిబిరాలకు హాజరు కావాలి. బీమా పొందే వ్యక్తి ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా పేర్కొనవచ్చు. వృద్ధులు, దివ్యాంగులు శిబిరాలకు రాలేని పక్షంలో, వారి ఇంటి వద్దకే వెళ్లి నమోదు చేసేలా ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. జిల్లా యంత్రాంగాలు, స్థానిక అధికారులు ఈ పథకం అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



# జగన్, షర్మిల మధ్య ఆస్తుల వివాదం

### యలహంక ప్యాలెస్ వద్ద భద్రత కట్టుదిట్టం

### జగన్, ఆయన సోదరి షర్మిల మధ్య యలహంక ప్యాలెస్ వివాదం మరింత ముదిరింది

### తాజాగా యలహంక ప్యాలెస్ వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

### యలహంక ప్యాలెస్ వద్ద భద్రత కట్టుదిట్టం

యలహంక ప్యాలెస్ వద్ద భద్రత కట్టుదిట్టం వైఎస్సార్సీపీ అధినేత జగన్, ఆయన సోదరి షర్మిల మధ్య యలహంక ప్యాలెస్ వివాదం మరింత ముదిరింది. నిన్న(శనివారం) బెంగళూరులోని దేవనహళ్లి కోర్టు వైఎస్ షర్మిలను బంగ్లా ప్రాంగణంలోకి ప్రవేశించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా యలహంక ప్యాలెస్ వద్ద బెంగళూరు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.షర్మిల తన కుమార్తె అంజిలిరెడ్డి వివాహ ఏర్పాట్ల నిమిత్తం నేడు(ఆదివారం) బెంగళూరులోని యలహంకలో ఉన్న తమ కుటుంబ బంగ్లా 'యలహంక ప్యాలెస్'ను సందర్శించాలని నిశ్చయించుకున్నారు. దీంతో కోర్టు ఉత్తర్వుల ప్రకారం ముందు జాగ్రత్త చర్యగా, యలహంక ప్యాలెస్ ముందు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లోకి షర్మిల రాకుండా స్టే ఇవ్వాలని జగన్ కోర్టుకెక్కారు. దేవనహళ్లి కోర్టులో సిలికాన్ బిల్డర్స్ లిమిటెడ్ పేరుతో పిటిషన్ వేశారు. తన కుమార్తె పెళ్లి పనుల్లో భాగంగా షర్మిల ఆదివారం యలహంక ప్యాలెస్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసి ఆమెను అడ్డుకునేందుకు జగన్ కోర్టును ఆశ్రయించారు. అయితే దేవనహళ్లి కోర్టులో వైఎస్ షర్మిలకు ఎదురుదెబ్బ



తగిలింది.దీంతో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లోకి తన సోదరి షర్మిల అడుగుపెట్టకుండా అడ్డుకున్నారు. గతంలో భారతి డైరెక్టర్‌గా ఉన్న సిలికాన్ బిల్డర్స్ సంస్థ ద్వారా చెల్లెల్ని కోర్టుకు లాగారు. గెస్ట్‌హౌస్‌లో తాత్కాలికంగా ఉండటానికి అనుమతి పొందిన షర్మిల, ప్రస్తుతం అలంకరణ పనుల నెపంతో బయటి వ్యక్తులను ప్యాలెస్‌లోకి పంపుతున్నారని, వారిని నిలువరించకపోతే అక్కడి నిర్మాణాలు, ఫెన్సింగ్, పండ్ల చెట్లు, చరాస్తులకు నష్టం కలిగిస్తారని సిలికాన్ బిల్డర్స్‌తో బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్లిలోని సీనియర్ సివిల్, జేఎంఎఫ్‌సీ కోర్టులో దావా వేయించారు. విచారించిన న్యాయస్థానం తదుపరి విచారణ వరకు యలహంక ప్యాలెస్‌లోకి షర్మిల, ఆమెకు సంబంధించిన వ్యక్తులు, ప్రవేశించకుండా నిలువరిస్తూ ఆదేశాలిచ్చింది.షర్మిల తన కుమార్తె అంజిలిరెడ్డి వివాహాన్ని యలహంక ప్యాలెస్‌లో నిర్వహిస్తున్నానంటూ ఆహ్వాన పత్రికలను ముద్రించి బంధుమిత్రులకు పంచగా అక్కడ పెళ్లి చేయడానికి వీల్లేదంటూ జగన్ అడ్డుపడ్డ విషయం తెలిసిందే. 'నేను నివసిస్తున్న ప్రాంగణంలో వివాహం చేస్తే తీవ్రమైన భద్రత సమస్యలు తలెత్తుతాయి. ఇక్కడ నేను, నా కుటుంబం సురక్షితంగా ఉండేలా చూసుకోవాలనుకుంటున్నాను' అని జగన్ ఇటీవల షర్మిలకు లేఖ రాశారు.దీంతో షర్మిల కుమార్తె వివాహ వేదికను మరోచోటికి మార్చుకున్నారు. పెళ్లి పనుల్లో భాగంగా ఆమె మూడు రోజుల కిందట యలహంక ప్యాలెస్‌కు వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమెను ప్యాలెస్‌లో అడుగుపెట్టకుండా అడ్డుకునేందుకు జగన్ సిలికాన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి భీమిశెట్టి రమేష్‌బాబుతో పిటిషన్ వేయించారు. ఈ సంస్థలో 2017 ఫిబ్రవరి 16 వరకు వైఎస్ భారతి డైరెక్టర్‌గా ఉన్నారు. భగవత్ సన్నిధి ఎస్టేట్స్ ఎల్ఎల్పీలో రమేష్‌బాబు, భారతి ప్రస్తుతం డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు.'భారతి తల్లి ఇ.సి. సుగుణమ్మ 2007 మార్చి 1న 20 ఏళ్ల కాలానికి (2027 ఫిబ్రవరి 

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
సోమవారం 23 - 11 - 2026

## రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం.. కొండాపురంలో విషాదం



**కొండాపురం(తెలుగు కలం) (నవంబర్ 22) : ప్రతినిధి :** కడప జిల్లా కొండాపురం పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన పెద్దుగాళ్ళ బాబు (57), పెద్దుగాళ్ళు ప్రతాప్ అలియాస్ రౌడ్డ ప్రతాప్ (54) ఇద్దరూ తమ ఇంటి వద్ద నుండి కొండాపురం పట్టణంలోకి వస్తున్న క్రమంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రయాణ సమయంలో ఎదురుగా వస్తున్న ఒక లారీని తప్పించబోయిన వీరు, అదుపుతప్పి ఆ లారీ వెనుక వస్తున్న బస్సును బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అన్నదమ్ములిద్దరూ మృతి చెందారు. మృతులు ఇద్దరూ ముద్దనూరు ప్రభుత్వ హోస్టల్‌లో వంట మాస్టర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములిద్దరూ ఒకేసారి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న కొండాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కళ్యాణదుర్గంలో బోల్తా పడిన ఆటో...

## తృటిలో తప్పిన పెను ప్రమాదం



**కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 22) : ప్రతినిధి :** పట్టణంలోని రద్దీగా ఉండే అనంతపురం రోడ్డులో ఓ ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ అనూహ్య ఘటనతో స్థానికులు, ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయితే అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆటో బోల్తా పడిన వెంటనే అక్కడే ఉన్న స్థానికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా మానవత్వంతో స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్న వారు బోల్తా పడిన ఆటోను పైకి లేపి, లోపల చిక్కుకున్న డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడం, ఆటో కేవలం స్వల్పంగా మాత్రమే దెబ్బతినడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ఆందోళనకర వాతావరణం నెలకొంది. స్థానికులు సకాలంలో స్పందించి ఆటోను పక్కకు తొలగించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పరిస్థితి త్వరగా సద్దుమణిగింది. కాగా, ఆటో అదుపుతప్పడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రధాన రహదారులపై వాహనదారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని స్థానికులు ఈ సందర్భంగా సూచిస్తున్నారు.

## అదుపుతప్పి తాడిచెట్టును ఢీకొన్న కారు..

## పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లిన వైనం



**బల్లికురువ (తెలుగు కలం) (నవంబర్ 22) : ప్రతినిధి : ప్రకాశం జిల్లా** బల్లికురువ--కొమ్మలపాడు ప్రధాన రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఒక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన ఓ కారు రహదారి పక్కనే ఉన్న తాడిచెట్టును బలంగా ఢీకొట్టి, ఆపై పక్కనే ఉన్న మార్జిన్ కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదానికి గురైన వాహనం ఏపీ 37 సీటీ 7777 నంబరు కలిగిన కారుగా గుర్తించారు. తెల్లవారుజామున ప్రయాణిస్తున్న సమయంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే వాహనం అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. అయితే, ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు, ఆదివారం సాయంత్రం వరకు కూడా ప్రమాదానికి గురైన కారును తీసుకెళ్లేందుకు సంబంధిత వ్యక్తులెవరూ ఘటనా స్థలానికి రాకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాద సమయంలో కారులో ఎంతమంది ప్రయాణిస్తున్నారు, ఎవరికైనా గాయాలయ్యాయా అన్న పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సర్పంచ్ అభ్యర్థి తనూజను గెలిపించండి

### శెట్టూరులో మాజీ ఎంపీ తలారి రంగయ్య విస్తృత ప్రచారం



**శెట్టూరు (తెలుగు కలం) (నవంబర్ 22) : ప్రతినిధి :** గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శెట్టూరు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి తనూజకు మద్దతుగా మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన గ్రామంలోని వివిధ వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను స్వయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి తనూజను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నిరంతరం కృషి చేసే అభ్యర్థికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా స్థానికులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ, వైసీపీ నాయకులు మరియు కార్యకర్తలు సమన్వయంతో ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని తనూజ విజయానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ ప్రజల నుండి వస్తున్న విశేష ఆదరణతో సర్పంచ్ అభ్యర్థి తనూజ ఘన విజయం సాధిస్తారనే ధీమాను డాక్టర్ తలారి రంగయ్య వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెంకటాపురంలో వైసీపీకి షాక్.. ఎంపీపీ మధుబాబు

## సమక్షంలో టీడీపీలోకి 30 ముస్లిం కుటుంబాలు



**ఆత్మకూరు (తెలుగు కలం) (నవంబర్ 22) : ప్రతినిధి :** కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబాలు వైయస్సార్సీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆదివారం ఎంపీపీ తేనె మధుబాబు ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామానికి చెందిన సుమారు 30 ముస్లిం కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీపీ మధుబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, శివారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ప్రజలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్ల రూపాయలతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గ ప్రజల హృదయాల్లో సేవకు మారుపేరుగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నిలిచిపోయారని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో వేల్పనూరు అలీ బాషా, మౌలాలి, సైపుద్దీన్, నబి రసూల్ తదితరులు ఉన్నారు.

# బీరప్ప సర్కిల్‌లో రోడ్డు కోసం ప్రజాగ్రహం.. 40 నిమిషాల పాటు భారీ రాస్తారోకో...

### పైపులైన్ పనుల పేరుతో రోడ్లన్నీ గుంతలమయం..
### దుమ్ము, ధూళితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న స్థానికులు
### రోడ్డు వేయకపోతే ఊరుకునేది లేదంటూ ప్రజల హెచ్చరిక





**గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 22) :** పట్టణంలోని బీరప్ప సర్కిల్ ప్రాంతంలో రోడ్ల దుస్థితిపై స్థానిక ప్రజలు భగ్గుమన్నారు. పైపులైన్ పనుల పేరుతో రోడ్లను తవ్వి వదిలేయడంతో రహదారులన్నీ గుంతలమయంగా మారాయని, నిత్యం దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుకు ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు.బీరప్ప సర్కిల్ నుంచి ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ప్రజలు రోడ్డు పనులు వెంటనే చేపట్టి, నాణ్యమైన రహదారిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. వీరికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు సైతం మద్దతుగా నిలవడంతో ఆందోళన మరింత ఉధృతమైంది. దాదాపు 40 నిమిషాల పాటు ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

**దుమ్ముతో ఊపిరి ఆడడం లేదు.. రాళ్ల దెబ్బలతో భయం ...:-**

స్థానికులు తమ ఆవేదనను వెల్లగక్కుతూ.. భారీ లారీలు, వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్డుపై ఉన్న దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరుతోందని, వాహనాల టైర్ల కింద నుంచి ఎగిరిపడుతున్న కంకర రాళ్లు ఇళ్లలోకి దూసుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దుమ్ము కారణంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని, రోడ్డు తవ్వినప్పటి నుంచి తమకు ఆరోగ్య సమస్యలు, నిత్య ఇబ్బందులే మిగిలాయని కన్నీటిపర్యంతమయ్యారు.

**అధికారులు ఇప్పటికైనా స్పందించాలి :-**

రోడ్డు తవ్విన తర్వాత తిరిగి నిర్మించాల్సిన బాధ్యత అధికారులకు లేదా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ దుమ్ము పీలుస్తూ, గుంతల రోడ్లపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ఇకనైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని, దుమ్ము నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి సర్దిచెప్పడంతో ప్రజలు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

**ప్రజల సహనాన్ని పరీక్షించొద్దు.. రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి :-**

పైపులైన్ పనుల కోసం రోడ్డు తవ్వడం ఎంత అవసరమో, పనులు పూర్తయిన వెంటనే రహదారులను పునరుద్ధరించడం కూడా అంతే బాధ్యత. ప్రజల ఆరోగ్యం, రాకపోకలను పట్టించుకోకుండా రోడ్లను గుంతలమయంగా వదిలేయడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# దేవనబండ అభివృద్ధే లక్ష్యం.. సర్పంచ్ బరిలో మిదింటి దశరథ రాముడు

### మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ప్రవీణరెడ్డి గాంధీరెడ్డి ఆధ్వర్యంలో
### దశరథ రాముడి నామినేషన్





**పత్తికొండ నవంబర్ 22 తెలుగు కలం:** దేవనబండ గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిగా మిదింటి దశరథ రాముడు బరిలో నిలిచారు. పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగ్రాటి శ్రీదేవమ్మ ఆశీస్సులతో, దేవనబండ మాజీ సర్పంచ్ ప్రవీణరెడ్డి గాంధీరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సచివాలయంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు.

**గ్రామాభివృద్ధికి గతంలో ప్రత్యేక కృషి**

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ప్రవీణరెడ్డి గాంధీరెడ్డి మాట్లాడుతూ.. గతంలో గ్రామ సర్పంచ్‌గా ఉన్న సమయంలో దేవనబండ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారులకు సీసీ రోడ్లు,గ్రామ సచివాలయం,రైతు భరోసా కేంద్రం,పశువుల వైద్యశాల ఏర్పాటు,డ్రైనేజీ కాలువల నిర్మాణం,వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం వంటి పలు పనులు చేపట్టినట్లు వివరించారు.గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేశామని పేర్కొన్నారు.

**జగనన్న పాలనలో సంక్షేమ పథకాల అమలు**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలైన సంక్షేమ పథకాలతో అర్హులైన ప్రజలకు లబ్ధి చేకూరిందని నాయకులు పేర్కొన్నారు.రైతులకు రైతు భరోసా,విద్యార్థులకు అమ్మఒడి,విద్యా దీవెన, వసతి దీవెన,మహిళలకు వైఎస్సార్ ఆసరా, చేయూత,వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక భద్రతా పింఛన్లు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, నాడు-నేడు కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవలు,విద్యా సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించడమే ధ్యేయం**

గ్రామంలో తాగునీరు, రహదారులు,పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయడమే తమ లక్ష్యమని అభ్యర్థికి మద్దతుగా నిలిచిన నాయకులు తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు దశరథ రాముడికి అవకాశం కల్పించాలని వారు కోరారు. మిదింటి దశరథ రాముడు నామినేషన్ దాఖలు చేయడంతో దేవనబండ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సందడి నెలకొంది.ఈ కార్యక్రమం లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# నకిలీ పోలీసుల అవతారంలో వాహనదారుల నుంచి నగదు దోపిడీ.. ఇద్దరు నిందితుల అరెస్ట్



**కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 22) : ప్రతినిధి :** పోలీసులమంటూ నకిలీ గుర్తింపు కార్డులు చూపించి, వాహనదారులను బెదిరిస్తూ నగదు దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను కంబదూరు పోలీసులు అరెస్ట్ చేశారు. గుంతకల్లు పట్టణానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ (24), జె. అలీ అబ్బాస్ (27) నకిలీ పోలీస్ గుర్తింపు కార్డులు, పోలీస్ క్యాపులు ధరించి పోలీసులుగా నటిస్తూ అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఒంటరిగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వృద్ధులను లక్ష్యంగా చేసుకునేవారు. వారిని మార్గమధ్యంలో ఆపి తాము పోలీసులమని నమ్మించి, వారి వద్ద గంజాయి లేదా నకిలీ నోట్లు ఉన్నాయంటూ భయభ్రాంతులకు గురిచేసి నగదు వసూలు చేసేవారు. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో కళ్యాణదుర్గం -- నూతిమడుగు రహదారిలోని వై.సి.పల్లి వద్ద ఓ వృద్ధుడిని అడ్డగించిన నిందితులు, నకిలీ పోలీస్ గుర్తింపు కార్డు చూపించి కత్తితో బెదిరించి ఆయన వద్ద ఉన్న రూ.5,500 నగదును బలవంతంగా లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కంబదూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 102/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 319(2), 308(5)తో పాటు 3(5) ప్రకారం కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ?దర్యాప్తులో భాగంగా అదే రోజు సాయంత్రం 4.30 గంటల సమయంలో నూతిమడుగు గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వై.సి.పల్లి వద్ద వృద్ధుడిని బెదిరించి నగదు దోచుకున్న నేరాన్ని వారు అంగీకరించారు. అంతేకాకుండా గతంలో బెలుగుప్ప, యాడికి పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు, గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులు ఉన్నట్లు, కర్నూలు జిల్లా పరిధిలో జరిగిన మరో నేరంలోనూ తమ ప్రమేయం ఉన్నట్లు నిందితులు వెల్లడించారు. ?నిందితుల నుంచి రూ.5,500 నగదు, ఒక నకిలీ పోలీస్ గుర్తింపు కార్డు, రెండు పోలీస్ జంగిల్ క్యాపులు, ఒక చిన్న కత్తి, హోండా ఎస్పీ షైన్ ద్విచక్ర వాహనం మరియు రియల్‌మీ సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టినట్లు కంబదూరు పోలీసులు వెల్లడించారు. పోలీసులమంటూ ఎవరైనా వాహనాలను ఆపి గుర్తింపు కార్డులు చూపించినప్పుడు వారి అధికారిక గుర్తింపును నిర్ధారించుకోవాలని, అనుమానం కలిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని, అపరిచితుల బెదిరింపులకు భయపడి నగదు ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు.

# తెలుగు వెలుగు పద్య పఠనంతో పరవశించిన విద్యార్థులు





**అనంతపురం నవంబర్ 22 తెలుగుకలం :** ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2026లో భాగంగా రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేవు ఐఏఎస్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ గారి నేతృత్వంలో ఆదివారం పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాల వద్ద "తెలుగు వెలుగు పద్య పఠనం" కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ (అనంతపురం) మరియు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంతపురం ప్రముఖ చరిత్రకారులు శ్రీ రమేష్ నారాయణ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని, ప్రాచీనతను, విశిష్టతను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పరభాషా వ్యామోహంతో మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదని, ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో తెలుగులో మాట్లాడటం, చదవడం, రాయడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన జాగర్లపూడి శ్యామసుందర శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు సాహిత్యం, కవితలు మరియు పద్య పఠనం పట్ల ప్రత్యేక ఆసక్తిని పెంచుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ సహాయ సంచాలకులు శ్రీ ఎం. స్వామి నాయక్ మాట్లాడుతూ తెలుగు భాష కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదని, మన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర మరియు జీవన విలువలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ అనేది కేవలం భాషాభిమానుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి తెలుగువారి సామాజిక బాధ్యత అని, తెలుగు సాహిత్యాన్ని భావితరాలకు అందించడం ద్వారా మన భాషా వారసత్వాన్ని సజీవంగా ఉంచగలమని తెలిపారు. ఇంటాక్ ప్రతినిధి శ్రీ పి. కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలోనూ మాతృభాష ప్రాధాన్యతను గుర్తించి యువత తెలుగు భాషా వికాసంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇంటాక్ ప్రముఖులు శ్రీ కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శ్రీ రియాజ్, శ్రీ జూటూరు షరీఫ్ తెలుగు పద్యాల ద్వారా విద్యార్థులకు సామాజిక బాధ్యత, నైతిక విలువలపై సందేశాన్ని అందించారు. శ్రీ సూర్యనారాయణ రెడ్డి, శ్రీ సూర్య ప్రకాశ్ రెడ్డి, శ్రీ నాగభూషణం మాట్లాడుతూ నేటి తరానికి తెలుగు సాహిత్యాన్ని చేరువ చేయడంతో పాటు పఠనం, రచన, ద్య రచన వంటి సాహిత్య కార్యకలాపాల పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని కోరారు. ఈ పోటీల్లో విద్యార్థులు సుమతి శతకం, వేమన శతకం, భాస్కర శతకం, దాశరథి శతకం మరియు మాచిరాజు శతకంలోని పద్యాలను శ్రావ్యంగా ఆలపించడమే కాకుండా వాటి భావాలను చక్కగా వివరించారు. శతకాలలో నిక్షిప్తమైన నైతిక విలువలతో కూడిన జీవన విధానం నేటి సమాజానికి ఏ విధంగా అవసరమో విద్యార్థులు తమ మాటల్లో న్యాయనిర్ణేతలకు తెలియజేశారు. ఈ పోటీలకు శ్రీ రమేష్ నారాయణ, శ్రీ శ్యామసుందర శాస్త్రి, శ్రీ జూటూరు షరీఫ్ మరియు శ్రీ రామాంజనేయులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పద్య పఠన పోటీల విజేతలకు వారసత్వ వారోత్సవాల ముగింపు రోజైన నవంబర్ 25న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు సహాయ సంచాలకులు శ్రీ ఎం. స్వామి నాయక్ వెల్లడించారు. అలాగే సోమవారం (నవంబర్ 23) పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు "మీ ఇంట్లో వారసత్వం" అనే అంశంపై చిత్రలేఖనం మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
సోమవారం 23 - 11 - 2026

## పట్టా వారి శ్రీకాంత్ మోపూరి అనుప్రియ వివాహ వేడుకకు

### హాజరై ఆశీర్వదించిన మాల మహానాడు సభ్యులు, ఉపాధ్యాయులు



అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన పట్టా వారి శ్రీకాంత్, మోపూరి అనుప్రియ వివాహ వేడుకలు అనంతపురం నగరంలోని రుద్రంపేట బైపాస్ వద్ద ఉన్న వాల్మీకి కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. వివాహ ఆహ్వానం మేరకు వేడుకకు హాజరైన ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు నూతన వధూవరులు శ్రీకాంత్, అనుప్రియలను ఆశీర్వదించారు. దంపతులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, ఐశ్వైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి చియ్యేడు రాము, జిల్లా ఉపాధ్యక్షులు సాకే గోవర్ధన్, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు సాకే శ్రీదేవి, అనంతపురం నగర ఉపాధ్యక్షులు బి. సురేంద్ర, నగర ప్రధాన కార్యదర్శి వల్లూరు బాబు, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షులు కర్నాటి విజయ్ పాల్గొన్నారు.అలాగే ఉపాధ్యాయులు నారాయణ దాసు, వెంకట్ రెడ్డి, నాగరాజు, భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ జూనియర్ ఇంజనీర్ సాలప్ప, నవీన్, సిద్ధరాంపురం మురళి తదితరులు పాల్గొని నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేశారు.

## గుత్తి మున్సిపాలిటీ 22వ

### వార్డు కౌన్సిలర్‌గా కే. శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం..

**గుత్తి ప్రజలకు ఆత్మీయ ఆహ్వానం!**



అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్‌గా కే. శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయనున్న శుభసందర్భంగా ఈ నెల 23-11-2026, సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ప్రమాణ స్వీకార మహోత్సవానికి గుత్తి పట్టణ, మండల ప్రజలందరికీ హృదయపూర్వక ఆహ్వానం పలుకుతున్నాము. తెలుగుదేశం పార్టీ తరఫున ప్రజాప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించనున్న ఈ కార్యక్రమానికి పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలు, గ్రామాల ప్రజలు, యువకులు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. ప్రజల ఆశీస్సులు, సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారం, వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నాము. కావున గుత్తి మున్సిపాలిటీ ప్రజలందరూ ఈ వేడుకకు విచ్చేసి కే. శ్రీనివాసులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.

## సేవా దృక్పథం చాటుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**గాయపడిన విద్యార్థిని గోపికకు రూ.50 వేల ఆర్థిక సహాయం**



అనంతపురం జిల్లా రాప్తాడు ఘటనలో గాయపడిన గోపిక అనే విద్యార్థినికి ఎస్ఎఫ్ఐ నాయకులు సేవా దృక్పథంతో అండగా నిలిచారు. విద్యార్థిని చికిత్స పొందుతున్న బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గోపిక తల్లిదండ్రులతో మాట్లాడి ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కుటుంబానికి అండగా నిలుస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆపద సమయంలో విద్యార్థిని కుటుంబానికి ధైర్యం కల్పిస్తూ ఆర్థికంగా సహాయం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా, కష్టాల్లో ఉన్న విద్యార్థులకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఎస్ఎఫ్ఐ అనంతపురం జిల్లా కమిటీ నాయకులు తెలిపారు.

## పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ ..

## ఎం. హనుమాపురం సర్పంచ్ ఏకగ్రీవం!

:పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు తొలి విజయాన్ని నమోదు చేశారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని డి. హిరేహాళ్ మండలం ఎం. హనుమాపురం గ్రామ పంచాయతీలో టీడీపీ మద్దతుతో బరిలో నిలిచిన సర్పంచ్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసే సమయానికి సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్ మాత్రమే మిగలడంతో ఏకగ్రీవం ఖరారైంది. గ్రామ పంచాయతీలో మొత్తం 10 వార్డులు ఉండగా, ఎనిమిది వార్డులకు మాత్రమే అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. మిగిలిన రెండు వార్డులకు ఎవరూ నామినేషన్లు వేయలేదు. దీంతో సర్పంచ్ స్థానంతో పాటు ఎనిమిది వార్డుల సభ్యులు కూడా ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీవో దాస్ నాయక్, స్టేజ్-1 ఎన్నికల అధికారి కృష్ణకిషోర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం రిజర్వేషన్ రోస్టర్ ప్రక్రియలో భాగంగా ఈ పంచాయతీని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారు. సుమారు 2,370 మంది జనాభా, 1,637 మంది ఓటర్లు కలిగిన ఈ గ్రామంలో రాజకీయ ఆధిపత్య పోరుకు తావివ్వకుండా, డబ్బు మరియు ఇతర ప్రలోభాలకు దూరంగా ఉండి గ్రామ అభివృద్ధి కోసం గ్రామస్థులంతా ఏకాభిప్రాయానికి రావడం విశేషం. ఎన్నికలు నిర్వహించకుండానే సర్పంచ్‌తో పాటు ఎనిమిది మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.



## 2022 కానిస్టేబుల్ మిగిలిన

### 400 పోస్టులను తదుపరి మెరిట్ ప్రకారం భర్తీ చేయాల్సిందే..

**పోలీసు నియామక బోర్డుకు హైకోర్టు ఆదేశం.**

**నోటిఫికేషన్లోని క్లాజ్ 33(9) చెల్లదంటూ తీర్పు.**



పోలీస్ కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించి 2022లో ఇచ్చిన నోటిఫికేషన్ విషయంలో హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ నోటిఫికేషన్లో మిగిలిపోయిన 400 ఖాళీలను (లెఫ్ట్ ఓవర్ వేకెన్సీ) తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ నియామక బోర్డు లను ఆదేశించింది. ఈ ప్రక్రియను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని తేల్చిచెప్పింది. ప్రొవిజినల్ జాబితాను ఎట్టి పరిస్థితుల్లో సమీక్షించబోమని, వెయిటింగ్ లిస్ట్ ఉండదని, మిగిలిపోయిన ఖాళీలు రద్దవుతాయంటూ నోటిఫికేషన్లో పేర్కొన్న క్లాజ్ 33(9) చెల్లదని స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ఇటీవల ఈ మేరకు కీలక తీర్పు ఇచ్చారు.

# నకిలీ పోలీసుల అవతారమెత్తి వాహనదారుల నుంచి డబ్బులు వసూలు

**ఇద్దరు నిందితుల అరెస్ట్**

**నకిలీ పోలీస్ ఐడీ కార్డు, క్యాపులు, కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం**



కంబదూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులమని నమ్మించి వాహనదారులను బెదిరిస్తూ డబ్బులు దోచుకుంటున్న ఇద్దరు నిందితులను కంబదూరు పోలీసులు అరెస్ట్ చేశారు. గుంతకల్లు పట్టణానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్ (24), జె. అలీ అబ్బాస్ (27) నకిలీ పోలీస్ ఐడీ కార్డు, పోలీస్ క్యాపులు ధరించి పోలీసులుగా నటిస్తూ అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఒంటరిగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వృద్ధులను లక్ష్యంగా చేసుకునేవారు. వారిని మార్గమధ్యంలో ఆపి తాము పోలీసులమని పరిచయం చేసుకుంటూ, వారి వద్ద గంజాయి లేదా నకిలీ నోట్లు ఉన్నాయంటూ భయపెట్టి నగదు వసూలు చేసేవారు. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీ ఉదయం సుమారు 11 గంటల సమయంలో కల్యాణదుర్గం--నూతిమడుగు రహదారిలోని వై.సి.పల్లి వద్ద ఓ వృద్ధుడిని అడ్డగించి, నకిలీ పోలీస్ ఐడీ కార్డు చూపించి, కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.5,500 నగదును బలవంతంగా లాక్కొని వెళ్లారు. ఈ ఘటనపై కంబదూరు పోలీస్ స్టేషన్‌లో **Cr.No.**102/2026 **U/s** 319(2), 308(5) **r/w** 3(5) దీనిపై కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అదే రోజు సాయంత్రం 4.30 గంటల సమయంలో నూతిమడుగు గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా, పై నేరానికి పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. విచారణలో భాగంగా గతంలో బెలుగుప్ప, యాడికి పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు, గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులు ఉన్నట్లు, కర్నూలు జిల్లా పరిధిలో జరిగిన మరో నేరంలోనూ తమ ప్రమేయం ఉన్నట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.5,500 నగదు, ఒక నకిలీ పోలీస్ ఐడీ కార్డు, రెండు పోలీస్ జంగిల్ క్యాపులు, ఒక చిన్న కత్తి, ఒక హోండా ఎస్‌పీ షైన్ ద్విచక్ర వాహనం, ఒక రియల్‌మీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టినట్లు కంబదూరు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎవరైనా వ్యక్తులు పోలీసులమని చెప్పి వాహనాలను ఆపినా, గుర్తింపు కార్డులు చూపించినా వారి అధికారిక గుర్తింపును నిర్ధారించుకోవాలని, అనుమానం కలిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని, అపరిచితుల బెదిరింపులకు భయపడి నగదు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు.

# శిక్షణలో విషాదం.. అగ్నివీర్ సాహిల్ కుమార్ మృతి!

**నాలుగు నెలలకే ముగిసిన సైనిక ప్రస్థానం..**

**స్వగ్రామంలో విషాదఛాయలు..**



దేశానికి సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో భారత సైన్యంలో అగ్నివీర్‌గా చేరిన యువ సైనికుడు సాహిల్ కుమార్ శిక్షణ సమయంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లా, సుందర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని ఛత్తర్ సాయి గ్రామానికి చెందిన సాహిల్ కుమార్ నాలుగు నెలల క్రితమే భారత సైన్యంలో చేరాడు. మహారాష్ట్రలో రోప్ క్లైంబింగ్ శిక్షణ పొందుతున్న సమయంలో సుమారు 20 అడుగుల ఎత్తులో తాడు ఎక్కుతుండగా చేతులకు చెమట పట్టి పట్టు జారడంతో కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన సాహిల్ బుధవారం తుదిశ్వాస విడిచాడు. శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో బెటాలియన్‌కు చెందిన నలుగురు సైనికులు జాతీయ జెండాలో చుట్టిన సాహిల్ పార్థివదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. కన్నకొడుకు మృతదేహాన్ని త్రివర్ణ పతాకంలో చూసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సాహిల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల సమక్షంలో విషాద వాతావరణంలో అంత్యక్రియలు నిర్వహించారు. దేశ రక్షణలో సైనికుడిగా సేవలందించాలనే లక్ష్యంతో సైన్యంలో చేరిన యువకుడు కేవలం నాలుగు నెలలకే మృత్యువాత పడటం అందరినీ కలచివేసింది. అగ్నివీర్ సాహిల్ కుమార్ మృతికి న్యాయశక్తి న్యూస్ ఘన నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోంది. జైహింద్!

# కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం తలారి రంగయ్య.

**టిడిపి ఎంపీటీసీ తీరుపై రంగయ్య ఫైర్.**

**అధైర్య పడొద్దు నేనున్నా మల్లికార్జున కుటుంబానికి భరోసా.**



శెట్టూరు మండలం చింతర్లపల్లిలో వైసీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేదుకు పర్యటన. ఇటీవల టిడిపి ఎంపీటీసీ చెన్నకేశవులు చేతిలో దాడికి గురైన వైసీపీ నాయకులు గొల్ల మల్లికార్జున కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ఎంపీ,కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య స్వయంగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది.బాధిత కుటుంబ సభ్యులను ఆప్యాయంగా ఓదార్చి,జరిగిన ఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.మీకు ఏమీ కాదు,నేనున్నాను అంటూ కొండంత భరోసా ఇచ్చారు.టీడీపీ ఎంపీటీసీ చెన్నకేశవులు వ్యవహరించిన తీరుపై తలారి రంగయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మల్లికార్జున కుటుంబంపై భౌతిక దాడి చేయడమే కాకుండా,బట్టలు విప్పి 'ఏం పీక్కుంటారో పీక్కోండి' అంటూ అసభ్యకరంగా ప్రవర్తించడం అత్యంత దారుణం,ప్రజా ప్రతినిధిగా ఉండి ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు" అంటూ మండిపడ్డారు.అధికార బలంతో,అహంకారంతో దాడులకు తెగబడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.కార్యకర్తల జోలికొస్తే సహించం."వైసీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు.పార్టీ కార్యకర్తలకు,నాయకులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను.ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు.మీకు ఏ కష్టం వచ్చినా,ఎలాంటి ఆపద వచ్చినా ముందుండి ధైర్యంగా పోరాడుతాను" అంటూ మల్లికార్జున కుటుంబానికి,గ్రామంలోని పార్టీ శ్రేణులకు పూర్తి భరోసా కల్పించారు.దాడికి పాల్పడిన వారిపై పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాయదుర్గం మున్సిపల్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

**చైర్మన్‌గా టంకశాల హనుమంతు బాధ్యతల స్వీకారం**

**40 మంది కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు పూర్తి!**



రాయదుర్గం పట్టణ పురపాలక సంఘంలో నూతన పాలకమండలి కొలువుదీరనుంది. 9వ మున్సిపల్ పాలకమండలి ఏర్పాటుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నవంబర్ 23, 2026, సోమవారం ఉదయం 10 గంటలకు రాయదుర్గం మున్సిపల్ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా టంకశాల



హనుమంతు, నూతనంగా ఎన్నికైన 40 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ నూతన పాలకమండలిలో కూటమి తరఫున 37 మంది కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ తరఫున ఇద్దరు, ఎంఐఎం తరఫున ఒకరు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వ నాయకులు, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు, జిల్లా స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరుకానున్నారు. తమ అభిమాన నాయకులు, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, సీఐ దేవానంద్




ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది.నూతన పాలకమండలి బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో రాయదుర్గం పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి కొత్త పాలకవర్గం ఎలాంటి చర్యలు చేపడుతుందోనని పట్టణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## భక్త కనకదాసు ఆశయాలను

# ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

**కురువ సంఘం అధ్యక్షులు పర్వతం భీమలింగయ్య**



అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని శ్రీ భక్త కనకదాసు 539వ జయంతి సందర్భంగా గుత్తి కురువ సంఘం అధ్యక్షులు పర్వతం భీమలింగయ్య గుత్తి పట్టణ, మండల ప్రజలకు, కురువ కుటుంబ సభ్యులకు జయంతి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి, సంగీతం, సాహిత్యం ద్వారా సమాజంలో నెలకొన్న వివక్షను రూపుమాపేందుకు కృషి చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు భక్త కనకదాసు అని కొనియాడారు. ఆయన చూపిన మార్గం, బోధించిన సమానత్వ భావాలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆ మహనీయుడి పవిత్ర ఆశయాలను స్మరించుకుంటూ సమాజంలో ఐక్యత, సమానత్వం, సోదరభావాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. భక్త కనకదాసు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీలో కురువ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం అధ్యక్షులు పర్వతం భీమలింగయ్య, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చామంతుల ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షులు బి. కుమార్, గౌరవ అధ్యక్షులు శ్రీరంగయ్య, బి. శంకర్, బి. వెంకటేష్, బి. శ్రీనివాసులు, సి. నారాయణ, వి. నారాయణస్వామి, పి. రవికుమార్, కె. రూపేష్ కుమార్, జి. చిన్న రంగయ్య, ఎం. యుగంధర్, పి. మహేష్, ఎం. ఉపేంద్రతో పాటు పలువురు కురువ సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధే ధ్యేయంగా భోగి కిరణ్ కుమార్ ప్రచార జోరు

**కత్తెర గుర్తుకు ఓటేయండి.. ఒక్క అవకాశం కల్పించండి**

**ఇంటింటా ఓట్ల అభ్యర్థన**





కంబదూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థి భోగి కిరణ్ కుమార్ ఆదివారం మండల కేంద్రంలోని వివిధ వీధుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ తనకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సేవే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచానని, ప్రజలు ఒక్క అవకాశం కల్పిస్తే కంబదూరు గ్రామపంచాయతీని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారం, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, పారిశుధ్య మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఈ ఎన్నికల్లో కత్తెర గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న వార్డు సభ్యుల అభ్యర్థులకు కూడా అండగా నిలవాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఏపీలో 3 కొత్త రైల్వే లైన్లకు ప్రతిపాదన - ఇక నేరుగా శ్రీశైలానికి రైలు మార్గం

**శ్రీశైల మల్లన్న క్షేత్రానికి రైల్వే కనెక్టివిటీ కోసం దక్షిణ కోస్తా రైల్వే అడుగులు వేస్తోంది**

**అలాగే రాజంపేట-నెల్లూరు, సామర్లకోట-చింతూరు లైన్లకు కూడా అనుమతివ్వాలని రైల్వేబోర్డును కోరింది**



ఏపీలో కొత్తగా మూడు రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టాలని దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారులు రైల్వేబోర్డుకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు మార్కాపురం-శ్రీశైలం-సికింద్రాబాద్, రాజంపేట-నెల్లూరు, సామర్లకోట-చింతూరు రైల్వే లైన్ల నిర్మాణం కోసం సర్వే చేపట్టి, డీపీఆర్ తయారీకి అనుమతి ఇవ్వాలంటూ రైల్వే బోర్డును కోరారు. ఈ రైల్వేలైన్ల అవసరం, కలిగే ప్రయోజనాలతో దక్షిణ కోస్తా రైల్వేజోన్ అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. వీటికి అనుమతి ఇస్తే ఫైనల్ లొకేషన్ సర్వే-ఎఫ్ఎల్ఎస్‌తో పాటు, సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక రూపొందిస్తామని వెల్లడించారు.మార్కాపురం నుంచి శ్రీశైలం మీదుగా సికింద్రాబాద్ వరకు 290 కిలోమీటర్ల మేర రైల్వే లైను నిర్మించాలన్నది దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారుల ప్రతిపాదన. ప్రస్తుతం శ్రీశైలం మల్లన్న ఆలయానికి వెళ్లేందుకు రైలు మార్గం లేదు. కొత్త రైలుమార్గం నిర్మిస్తే అటు సికింద్రాబాద్ వైపు నుంచి తెలంగాణతో పాటు ఉత్తరాది రాష్ట్రాల వారు, ఇటు మార్కాపురం వైపు నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలతో పాటు, దక్షిణాది రాష్ట్రాల వారు రైలులో శ్రీశైలం చేరుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని దొనకొండ-ఒంగోలు మధ్య కొత్త రైల్వే లైన్ కోసం సర్వే, డీపీఆర్ సిద్ధమవుతున్నాయి. మార్కాపురం-శ్రీశైలం-సికింద్రాబాద్ లైన్ కూడా వస్తే రెండింటి ద్వారా కృష్ణపట్నం, రామాయపట్నం నౌకాశ్రయాలకు చేరుకునేందుకు దగ్గర అవుతుంది.సామర్లకోట నుంచి జగ్గంపేట, రంపచోడవరం, మారేడుమిల్లి మీదుగా పోలవరం జిల్లా చింతూరు సమీపం వరకు ఏజెన్సీలో 150 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్ నిర్మించేలా ప్రతిపాదించారు. ఒడిశాలో మల్కన్‌గిరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల మీదుగా తెలంగాణలో భద్రాచలం, పాండురంగాపురం వరకు 173 కిలోమీటర్ల వరకు కొత్త రైల్వేలైన్ ఇప్పటికే మంజూరైంది. ఇప్పుడు ప్రతిపాదిస్తున్న సామర్లకోట-చింతూరు లైన్, మల్కన్‌గిరి-భద్రాచలం-పాండురంగాపురం లైన్‌లో కలుస్తుంది. దీనివల్ల ఏజెన్సీ నుంచి అటు భద్రాచలానికి, ఇటు సామర్లకోట, రాజమహేంద్రవరం వైపు రైల్వే కనెక్టివిటీ వస్తుంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి నుంచి బొగ్గు, ఇనుప ఖనిజం కాకినాడ పోర్టుకు ఈ రైలుమార్గం ద్వారా తరలించేందుకు అవకాశం ఏర్పడుతుంది.రాయలసీమ నుంచి కోస్తాలోని నెల్లూరు వైపు అనుసంధానించేలా రాజంపేట-నెల్లూరు మధ్య 120 కిలోమీటర్ల మేర కొత్త లైన్ ప్రతిపాదించారు. ప్రస్తుతం నేరుగా నెల్లూరు వైపు వచ్చేందుకు అవకాశం లేదు. దీంతో రేణిగుంట వరకు వెళ్లి, రావాల్సి ఉంటోంది. మధ్యలో ఓబుళవారిపల్లె నుంచి కృష్ణపట్నం పోర్టుకు రైల్వే లైన్ ఉంది. ఇది కృష్ణపట్నం రైల్ కంపెనీ లిమిటెడ్ ఆధీనంలో ఉంది. ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లు నడపాలనే డిమాండ్ ఉంది.కానీ ఇందులో ఒకచోట పెద్ద సొరంగం ఉంది. అక్కడ ప్రమాదం జరిగితే ప్రయాణికులు బయటపడే అవకాశం తక్కువ. అందుకే రాజంపేట నుంచి నేరుగా నెల్లూరుకు కొత్త లైన్ ప్రతిపాదించారు. ఇది నిర్మిస్తే ప్రయాణికుల రైళ్లతో పాటు, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులకు కనెక్టివిటీ వస్తుంది. ఈ మూడు ప్రాజెక్టులు అవసరమని ఏపీ ప్రభుత్వం కూడా రైల్వేశాఖకు లేఖలు రాసింది. త్వరలో వీటి ఎఫ్ఎల్ఎస్, డీపీఆర్‌కు అనుమతి వచ్చే అవకాశం ఉందని రైల్వేశాఖ వర్గాలు చెబుతున్నాయి.

# కష్టం చేసే చేతులే బలం.. అమెజాన్‌లో రూ.46 లక్షల ప్యాకేజీ సాధించిన గుంటూరు విద్యార్థిని వరలక్ష్మి



**గుంటూరు (తెలుగు కలం) (నవంబర్ 22) : ప్రతినిధి :**
ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. కూలీ పనులు చేసే తండ్రి, టైలరింగ్‌తో కుటుంబాన్ని నడిపించే తల్లి.. ఎన్నో త్యాగాలు చేసి చదివించిన గుంటూరుకు చెందిన వరలక్ష్మి అంతర్జాతీయ దిగ్గజ సంస్థ అమెజాన్‌లో భారీ ఉద్యోగం సాధించింది. గుంటూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదువుతున్న ఆమెకు ఏడాదికి రూ.46 లక్షల ప్యాకేజీ లభించింది. గుంటూరుకు చెందిన రాంబాబు, లక్ష్మీ సుజాత దంపతులకు ఇద్దరు పిల్లలు. తమకు పెద్దగా ఆర్థిక స్థోమత లేకపోయినా, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న దృఢ సంకల్పంతో వారు ముందుకెళ్లారు. తండ్రి కూలీ పనులకు వెళ్తూ, తల్లి టైలరింగ్ చేస్తూ వచ్చిన ఆదాయంలోనే పిల్లల చదువులకు తొలి ప్రాధాన్యం ఇచ్చారు. ఆ నమ్మకాన్ని నిలబెడుతూ వరలక్ష్మి వీవీఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో చేరి, తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకుని చదువుపై పూర్తి దృష్టి సారించింది. కళాశాలలో మంచి విద్యాప్రతిభ కనబరుస్తూ వచ్చిన వరలక్ష్మి, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రారంభమైన తర్వాత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంది. తొలుత పెద్ద కార్పొరేట్ సంస్థలో ఇంత భారీ ప్యాకేజీతో ఉద్యోగం వస్తుందని తాను కూడా ఊహించలేదని వరలక్ష్మి తెలిపింది. అయితే అమెజాన్ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో తన నైపుణ్యాలను ప్రదర్శించి డేటా ఇంజినీర్ ఇంటర్న్‌గా ఎంపికైంది. ఈ విజయంతో పాటు ఏడాదికి రూ.46 లక్షల ప్యాకేజీ దక్కడంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన ఈ ప్రయాణంలో అన్న చంద్రశేఖర్ పవన్ కుమార్ ఇచ్చిన ప్రోత్సాహం, కాలేజీ అధ్యాపకుల మార్గదర్శకత్వం ఎంతో తోడ్పడ్డాయని వరలక్ష్మి పేర్కొంది. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతి అవకాశాన్నీ సీరియస్‌గా తీసుకుని, తనకు చేతనైనంత బాగా సమాధానాలు ఇచ్చానని చెప్పింది. మనం ఏ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చామన్నది ముఖ్యం కాదని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సిద్ధం చేసుకుంటూ పట్టుదలతో కృషి చేస్తే తప్పకుండా విజయం సాధిస్తామని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. ఇదే కళాశాలకు చెందిన మరో విద్యార్థిని కుసుమ కూడా అమెజాన్‌లో ఏడాదికి రూ.46 లక్షల ప్యాకేజీతో ఎంపికవడం విశేషం. ఇద్దరు విద్యార్థినుల ఘనవిజయంపై వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఎండలో చెమటోడ్చి, కుట్టుమిషన్‌పై శ్రమించి తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసిన వరలక్ష్మి విజయం, సాధారణ నేపథ్యం ఉన్న ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

# 150 దేశాల కరెన్సీ, వందల ఏళ్ల నాటి నాణేలు

**నర్సాపూర్ లైబ్రేరియన్ అపురూప సేకరణ**

**మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన యాదగిరి ప్రభుత్వ లైబ్రేరియన్‌గా పనిచేస్తూ పురాతన నాణేలు, కరెన్సీ స్టాంపులతో పాటు సుమారు 150 దేశాల కరెన్సీ నోట్లు సేకరించారు**



150 దేశాల నాణేలు, కరెన్సీ నోట్లు. వంద దేశాల పోస్టల్ స్టాంపులు, రాజుల కాలం నాటి అరుదైన నాణేలు. ఇదీ మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి అపురూప సేకరణ. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే చరిత్రపై ఉన్న ఆసక్తితో అరుదైన నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపులను సేకరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. ఒకప్పుడు చిల్లర నాణేలతో ప్రారంభమైన ఆయన ప్రయాణం, నేడు వందల ఏళ్ల చరిత్రను ప్రతిబింబించే ఖజానాగా మారింది.మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన జీడిమెట్ల యాదగిరి ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిగి గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నారు. 1997లో తూప్రాన్ గ్రంథాలయంలో అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన ఆయనకు పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగజైన్లు చదివే అలవాటు ఉండేది. ఈ క్రమంలోనే పురాతన నాణేలు, కరెన్సీ నోట్లు, పోస్టల్ స్టాంపుల గురించి తెలుసుకొని వాటి సేకరణపై ఆసక్తి పెంచుకున్నాడు. ఉద్యోగరీత్యా ప్రతిరోజూ నర్సాపూర్ నుంచి తూప్రాన్‌కు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే యాదగిరి టికెట్ తీసుకున్న తర్వాత తిరిగి వచ్చే చిల్లరను భద్రపరచడం ప్రారంభించారు.అలా సేకరించిన నాణేలు కొద్దిరోజులకే రెండు బాక్సులు నిండాయి. వాటిని పరిశీలించగా కొన్ని అరుదైన పాత నాణేలు కనిపించడంతో వాటి సేకరణను తన అభిరుచిగా మార్చుకున్నారు. ఈ ఆసక్తిని చూసి కొందరు బంధువులు హేళన చేసినప్పటికీ ఆయన వెనక్కి తగ్గకపోగా తన అభిరుచిని మరింత విస్తరించారు.ఈ అరుదైన నాణేల కోసం యాదగిరి హైదరాబాద్‌లోని జుమ్మెరాత్ బజార్, చార్మినార్, ఎర్రగడ్డతో పాటు కేరళం, ముంబయి తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. స్నేహితులు, బంధువులు, ఉద్యోగులు, పరిచయస్తుల వద్ద ఉన్న పాత నాణేలను వాటి విలువకు తగిన డబ్బు చెల్లించి సేకరించారు. వాటిలో రాజులు, నవాబుల కాలం నాటి నుంచి బ్రిటిష్ పాలనలో విడుదలైన నాణేల వరకు ఎన్నో అపురూపమైన కాయిన్లు ఉన్నాయి. ప్రధానంగా పంచింగ్ కాయిన్స్, రామ టెంకీలు, టిప్పు సుల్తాన్ కాలం నాటి నాణేలు, ట్రావెన్‌కోర్ రాజ్యానికి చెందిన నాణేలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.విక్టోరియా రాణి చిత్రంతో ఉన్న బ్రిటిష్ కాలం నాటి నాణేలు, జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తల చిత్రాలతో ముద్రించిన నాణేలు సైతం ఈ ఖజానాలో చోటు సంపాదించాయి. శ్రీలంక క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచిన సందర్భంగా ఆ దేశం విడుదల చేసిన ప్రత్యేక ఐదు రూపాయల నాణెం కూడా ఆయన కలెక్షన్‌లో ఉంది. ఒకటి, రెండు, మూడు, పది, ఇరవై, యాభై పైసల నుంచి రూపాయి, ఐదు, పది రూపాయల వరకు గతంలో చలామణిలో ఉన్న అనేక నాణేలను యాదగిరి భద్రపరిచారు.“గతంలో విధులకు వెళ్లేందుకు నర్సాపూర్ నుంచి తూప్రాన్‌కు బస్సుల్లో వెళ్లేవాణ్ని. టికెట్టు తీసుకనేందుకు చిల్లర సమస్య బాగా ఉండేది. దీంతో ఎక్కువగా నాణేలు వెంట తీసుకెళ్లేవాణ్ని. ఒకరోజు పేపర్‌లో కాయిన్స్ కలెక్షన్ గురించి ఆర్టికల్ చూసి నేను కూడా ఇలా సేకరించొచ్చు కదా అని భావించాను. 30 ఏళ్లుగా నాణేలు, స్టాంపులు, యాంటిక్ వస్తువులను సేకరిస్తున్నాను. ఇప్పటివరకు సుమారు 150 దేశాల కరెన్సీ కలెక్ట్ చేశాను.150 దేశాల కరెన్సీ నాణేలతోపాటు 100 దేశాలకు చెందిన పోస్టల్ స్టాంపులను కూడా యాదగిరి సేకరించారు. బ్రిటిష్ జనరల్స్‌కు సంబంధించిన పాత స్టాంపులు, చేతిరాతతో కూడిన అరుదైన కవర్లు ఈ సేకరణలో ప్రత్యేకంగా కనిపిస్తాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా విడుదలైన మూడు ప్రత్యేక స్టాంపులతోపాటు గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, మదర్ థెరిస్సా వంటి ప్రముఖుల చిత్రాలతో ఉన్న స్టాంపులను భద్రపరిచారు. రామాయణం, మహాభారతం, సాయిబాబా తదితర అంశాలకు సంబంధించిన స్టాంపులు కూడా ఈయన కలెక్షన్‌లో ఉన్నాయి.ఏళ్ల తరబడి సేకరించిన ఈ అరుదైన సంపదను యాదగిరి పలు సందర్భాల్లో ప్రజల చూసేందుకు ప్రదర్శనకు ఉంచారు. జిల్లా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మెదక్ లైబ్రేరీలో ప్రత్యేకంగా నాణేలు, కరెన్సీ నోట్లు, పోస్టల్ స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెదక్ గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి ఈ ప్రదర్శనను ప్రారంభించి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, పురాతన నాణేలు, స్టాంపులను ఆసక్తిగా తిలకించారు.“ఇలా స్టాంపులు, కరెన్సీ, యాంటిక్ వస్తువుల సేకరణతో మనకు చరిత్ర గురించి తెలుస్తుంది. అప్పటి కాలంలో ఉన్న పరిస్థితులు, జీవన విధానాన్ని తెలుపుతాయి. దేశానికి స్వాతంత్రం రాక ముందు నుంచే రాగి నాణేలు చలామణిలో ఉన్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు కరెన్సీ ఎలా పరిణామం చెందిందో ఇలా నాణేల సేకరణ ద్వారా తెలుసుకోవచ్చు” - సుహాసినిరెడ్డి, మెదక్ గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌కాలం మారుతున్నా, కరెన్సీ రూపం మారుతున్నా గత చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచే నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపులను యాదగిరి అపురూపంగా కాపాడుతున్నాడు. ఉద్యోగ బాధ్యతలతోపాటు తన అభిరుచిని కొనసాగిస్తూ, అరుదైన చారిత్రక సంపదను భావితరాలకు పరిచయం చేస్తున్నారు.

# టెన్త్ సర్టిఫికెట్లలో మార్పులు కావాలా.. ఇక మీసేవలోనే దరఖాస్తు!

**టెన్త్ సర్టిఫికెట్ సవరణలు ఇకపై మీసేవ ద్వారానే**

**మాన్యువల్, ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ రద్దు**

**ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుల పరిశీలన, ఆమోదం ప్రక్రియ**

**పారదర్శకత, వేగవంతమైన సేవలే లక్ష్యమన్న విద్యాశాఖ**




తెలంగాణలో పదో తరగతి (ఎస్ఎస్సీ) సర్టిఫికెట్లలోని వివరాల సవరణ ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చింది. ఇకపై పేరు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ వంటి మార్పుల కోసం విద్యార్థులు మీసేవ కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు మాన్యువల్ లేదా ఆఫ్‌లైన్ దరఖాస్తులను స్వీకరించబోమని, అన్ని జిల్లాల విద్యాధికారులకు, మండల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసింది.కొత్త విధానం ప్రకారం, విద్యార్థులు మీసేవ కేంద్రంలో అవసరమైన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకున్న తర్వాత, ఆ దరఖాస్తును వారు చదివిన పాఠశాల హెడ్‌మాస్టర్‌కు ఆన్‌లైన్‌లో పంపుతారు. హెడ్‌మాస్టర్ స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో వివరాలు పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, తమ అభిప్రాయంతో ఉన్నతాధికారులకు ఫార్వార్డ్ చేస్తారు.అక్కడి నుంచి దరఖాస్తు మండల విద్యాధికారి (ఎంఈవో), జిల్లా విద్యాధికారి (డీఈవో) కార్యాలయాలకు వెళ్తుంది. వివిధ స్థాయిల్లో క్షుణ్ణంగా పరిశీలన పూర్తయ్యాక, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ తుది ఆమోదం తెలుపుతాయి. అనంతరం సవరించిన మెమోను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులు దానిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.గతంలో విద్యార్థులు ఫీజును బ్యాంకు చలాన్ ద్వారా చెల్లించి, మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. ఈ విధానంలో జాప్యం జరుగుతోందని, కొత్త ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పారదర్శకత పెరగడంతో పాటు సవరణలు వేగంగా పూర్తవుతాయని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇకపై డైరెక్టర్ కార్యాలయానికి నేరుగా మాన్యువల్ ప్రతిపాదనలు పంపినా వాటిని పరిగణనలోకి తీసుకోబోమని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో నాలుగు హోటళ్ల లైసెన్సులు రద్దు

**కిచెన్లలో బొద్దింకలు, ఎలుకల విసర్జితాలు**

**హైదరాబాద్‌లో నిబంధనలు ఉల్లంఘించిన నాలుగు రెస్టారెంట్లపై కఠిన చర్యలు**

**మాదాపూర్ బావర్చి, స్పైస్ కిచెన్‌లతో పాటు మరో రెండు హోటళ్లపై వేటు**

**అనుమతులు లేకుండా నడుస్తున్న హాస్టల్, బేకరీ తక్షణ మూసివేత**

**సుమారు 135 కిలోల నాసిరకం ఆహార పదార్థాల సీజ్**

**ఫుడ్ డెలివరీ యాప్‌ల నుంచి ఆ హోటళ్లను తొలగించాలని ఆదేశం**



హైదరాబాద్ నగరంలోని ప్రముఖ రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఏ+ గ్రూఖీజు) కఠిన చర్యలు తీసుకున్నారు. వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు కలిగించేలా తీవ్ర లోపాలకు పాల్పడిన నాలుగు హోటళ్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేశారు. వీటితో పాటు అనుమతులు లేకుండా నడుస్తున్న ఒక హాస్టల్, బేకరీలను మూసివేయించారు.లైసెన్సులు రద్దయిన వాటిలో మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని ‘మాదాపూర్ బావర్చి’, కూకట్‌పల్లిలోని ‘ది స్పైస్ కిచెన్’, టోలిచౌకిలోని ‘మతామ్ అల్ యమాని అరేబియన్ రెస్టారెంట్’, చందానగర్‌లోని ‘అన్నపూర్ణ క్యాటరర్స్’ ఉన్నాయి. ఈ నాలుగు సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.ఈ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తీవ్రమైన అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. వంటగదుల్లో బొద్దింకలు, ఎలుకల విసర్జితాలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఫ్రిడ్జ్‌లలో శాకాహారం, మాంసాహారాన్ని నిబంధనలకు విరుద్ధంగా కలిపి నిల్వ ఉంచడం, నాసిరకం సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగించడం, కిచెన్ నేలలు దెబ్బతినడం, గోడలు పొగతో నిండి ఉండటం వంటి సమస్యలు కనిపించాయి. అంతేకాకుండా, ఆహారాన్ని తయారుచేసే సిబ్బందికి ఎలాంటి వైద్య పరీక్షల ధ్రువపత్రాలు లేవని తనిఖీల్లో తేలింది.మరోవైపు, కనీస ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేదా రిజిస్ట్రేషన్లు లేకుండా నిర్వహిస్తున్న టోలిచౌకిలోని ‘అల్ కరీమ్ బేకర్స్’, గౌలిదొడ్డిలోని ‘శ్రీ లక్ష్మి లగ్జరీ మెన్స్ హాస్టల్’లను కూడా అధికారులు మూసివేయించారు.ఈ సోదాల సందర్భంగా కల్తీ జరిగినట్లు అనుమానం ఉన్న 8 ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. దాదాపు 135 కిలోల నాణ్యతలేని ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. రాజు గారి బిర్యానీ, స్వాద్ స్పైసీ రెస్టారెంట్లకు త్వరలోనే షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. మెహఫిల్ రెస్టారెంట్‌కు లోపాలను సరిదిద్దుకోవాలని ‘ఇంప్రూవ్‌మెంట్ నోటీసు’ ఇచ్చి, త్వరలోనే రీ-ఇన్‌స్పెక్షన్ చేయనున్నట్లు వెల్లడించారు.లైసెన్సులు పునరుద్ధరించే వరకు సస్పెన్షన్‌కు గురైన నాలుగు రెస్టారెంట్లను తమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలకు అధికారులు స్పష్టం చేశారు. నగర ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని, ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని సంస్థలపై నిరంతరం కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# కారు అరలో బంగారు బిస్కెట్లు స్వాధీనం చేస్తున్న డీఆర్ఐ అధికారులు

**కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కి తరలిస్తున్న బంగారు నిల్వలను హైదరాబాద్ డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు**

**స్మగ్లింగ్ వెనుక ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం అధికారులు గాలిస్తున్నారు**



అక్రమ బంగారం రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఉక్కుపాదం మోపారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న భారీ బంగారు నిల్వలను హైదరాబాద్ డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. కారు టెయిల్ ల్యాంప్ వెనుక ప్రత్యేక అరలు ఏర్పాటు చేసి తరలిస్తున్న రూ.3.83 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ నెల 19న కోల్‌కతా నుంచి హైదరాబాద్ వస్తున్న ఒక కియా సెల్టోస్ కారును అడ్డగించి డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేశారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కారును వెనుక టెయిల్ ల్యాంప్ భాగంలో ఎవరికీ అనుమానం రాకుండా ప్రత్యేకంగా తయారు చేసిన ఒక రహస్య అర అధికారుల కంటపడింది. అందులో బ్రౌన్ టేప్‌తో చుట్టి ఉన్న మూడు ప్యాకెట్లను గుర్తించి బయటకు తీశారు. ఆ ప్యాకెట్లను విప్పి చూడగా 25 బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. వీటి బరువు 2.98 కిలోలు కాగా, మార్కెట్లో వీటి విలువ సుమారు రూ.3.83 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.స్వాధీనం చేసుకున్న 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంలో కొన్నింటిపై విదేశీ ముద్రలు ఉండగా, మరికొన్నింటిపై ముద్రలను చెరిపివేసినట్లు అధికారులు గుర్తించారు. కస్టమ్స్ చట్టం 1962 కింద 25 బంగారు బిస్కెట్లతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన కారును అధికారులు సీజ్ చేశారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి, ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు శంషాబాద్ విమానాశ్రయంలో 1.049 కిలోల బంగారం అధికారులు పట్టుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడి వద్ద అక్రమ బంగారం స్వాధీనం చేసుకున్నారు. ట్రాలీ బ్యాగులోని వాలెట్‌లో దాచిన 9 బంగారు బార్లు అధికారులు గుర్తించారు. యూఏఈ మార్కింగ్ ఉన్న రూ.1.37 కోట్ల విలువ ఉంటుందని అంచనా. ప్రయాణికుడి వద్ద బంగారం తీసుకునేందుకు వచ్చిన వ్యక్తిని కూడా అరెస్టు చేశారు.

# అనంతపురం జిల్లా క్రీడల్లో భరత్ సత్తా

**లాంగ్ జంప్, 100 మీటర్లలో ప్రథమ స్థానం**



**అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 22) : ప్రతినిధి :**
అనంతపురం జిల్లా ఆర్డీటీ స్పోర్ట్స్ మీట్‌లో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థి పి. భరత్ అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించాడు. పాఠశాలలో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న భరత్, అండర్-10 విభాగంలో నిర్వహించిన లాంగ్ జంప్ మరియు 100 మీటర్ల పరుగు పందెం పోటీలలో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి, డైరెక్టర్లు ఎ. సంతోష్ రెడ్డి, ఎ. మధుకర్ రెడ్డి, జోనల్ ఇన్‌ఛార్జ్ ఎం. శివకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ వై. లక్ష్మీదేవి, డీజీఎం ఎం. రమణ, మరియు ఏజీఎం ఎస్. రవిచంద్ర విద్యార్థి భరత్‌ను ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయసులోనే జిల్లా స్థాయిలో విజేతగా నిలవడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో భరత్ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం భరత్‌కు మెళకువలు నేర్పిన క్రీడా శిక్షకులకు (కోచ్‌లకు), నిరంతరం ప్రోత్సహించిన తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

సోమవారం 23 - 11 - 2026

# భోజనం తర్వాత పైనాపిల్.. ఎంత మేలు చేస్తుందో తెలుసా

**పైనాపిల్‌లోని బ్రోమెలైన్ ప్రొటీన్ల జీర్ణక్రియకు తోడ్పాటు**

**భోజనం తర్వాత పైనాపిల్ తీసుకోవడం ఉపయోగకరం**

**వీంట్లోని ఫైబర్ ప్రేగుల ఆరోగ్యానికి తోడ్పాటు**

**యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్-సి**

**మితంగా తింటే కడుపు ఉబ్బరం తగ్గే అవకాశం**



భోజనం తర్వాత పైనాపిల్ ముక్కలు తినడం చాలామందికి ఇష్టం. రుచితో పాటు జీర్ణక్రియకు కూడా ఇది ఉపయోగపడొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పైనాపిల్‌లో ఉండే 'బ్రోమెలైన్' అనే ఎంజైమ్ ఇందుకు ప్రధాన కారణం. ఇది ఆహారంలోని సంక్లిష్ట ప్రొటీన్లను చిన్న భాగాలుగా విడగొట్టడంలో సహాయపడుతుంది.

**ప్రొటీన్ల జీర్ణక్రియకు..**

మాంసం, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, పప్పుల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. వీటిని జీర్ణం చేయడానికి శరీరంలోని ఎంజైమ్‌లు పనిచేస్తాయి. పైనాపిల్‌లోని బ్రోమెలైన్ కూడా ప్రొటీన్లను చిన్న పెప్టైడ్లు, అమైనో ఆమ్లాలుగా విడగొట్టే ప్రక్రియకు తోడ్పడుతుంది.

**భోజనం తర్వాత ఎందుకు**

భోజనం పూర్తయ్యాక జీర్ణవ్యవస్థ ఆహారాన్ని విచ్ఛిన్నం చేసే పనిలో ఉంటుంది. ఈ సమయంలో పైనాపిల్ తీసుకోవడం వల్ల బ్రోమెలైన్ జీర్ణక్రియకు అదనపు సహకారం అందించొచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. భోజనం చేసిన తర్వాత కలిగే కడుపు ఉబ్బరం, అసౌకర్యాన్ని కొంతవరకు తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడొచ్చని చెబుతున్నారు.

**మరిన్ని ప్రయోజనాలు**

పైనాపిల్‌లో ఫైబర్, విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఫైబర్ పేగుల కదలికలకు తోడ్పడుతుంది. విటమిన్-సి శరీరానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. పైనాపిల్‌ను మితంగా తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం వంటి స్వల్ప జీర్ణ సమస్యల్లోనూ ఉపశమనం లభించొచ్చని సమాచారం.

**ఎంత తినాలి**

100 గ్రాముల పైనాపిల్‌లో సుమారు 48 క్యాలరీలు, 11-12 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 1.4 గ్రాముల ఫైబర్, 39 మిల్లీగ్రాముల విటమిన్-సి ఉంటాయి. భోజనం తర్వాత దాదాపు ఒక కప్పు తాజా పైనాపిల్ ముక్కలు తీసుకోవచ్చని సూచిస్తున్నారు. అయితే వ్యక్తి ఆరోగ్యం, ఆహార అలవాట్లను బట్టి పరిమాణం మారొచ్చు.

**అందరికీ సరిపోదు**

పైనాపిల్‌ను ఎక్కువగా తింటే నోటిలో మంట, చికాకు కలగొచ్చు. ఈ పండుతో అలర్జీ ఉన్నవారు దూరంగా ఉండాలి. బ్రోమెలైన్ సప్లిమెంట్లను వైద్యుల సూచన లేకుండా తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. పైనాపిల్ జీర్ణక్రియకు తోడ్పడొచ్చు కానీ శరీరంలోని సహజ జీర్ణవ్యవస్థకు ప్రత్యామ్నాయం కాదు.

# 'పరగడుపు అలవాట్లు' వీటితో ఎంతో ప్రమాదం ఉందంటున్న నిపుణులు

**ఉదయాన్నే వీటిని దూరం పెట్టండి ఖాళీ పొట్టతో తింటే జీర్ణ సమస్యలు**



ఉదయాన్నే నిద్ర లేవగానే మన జీర్ణవ్యవస్థ ఒక ఖాళీ స్పాంజ్ లాంటి స్థితిలో ఉంటుంది. రాత్రంతా ఉపవాసం తర్వాత, పరగడుపున మనం తీసుకునే మొదటి ఆహారాన్ని కడుపు చాలా వేగంగా గ్రహిస్తుంది. అందుకే, ఈ సమయంలో శరీరానికి అమృతం లాంటి పోషకాలు అందించాలి. అలాకాకుండా, కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయంటున్నారు.ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు జీర్ణాశయంలో యాసిడ్ల ఉత్పత్తి సహజంగానే ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో తప్పుడు ఆహారాలు లేదా పానీయాలు తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మందగించడమే కాకుండా, కడుపులో మంట, అల్సర్లు, తీవ్రమైన గ్యాస్ సమస్యలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పరగడుపున ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవద్దో ఇప్పుడు తెలుసుకుందాం.ఉప్పు, కారం, మసాలాలు ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు జీర్ణాశయంలో ఆహారం ఏదీ ఉండదు. దీనివల్ల మనం తినే కారం, మసాలాలు నేరుగా కడుపు లోపలి సున్నితమైన పొరను తాకి తీవ్రమైన చికాకును, మంటను కలిగిస్తాయి.సిట్రస్ పండ్లు : పండ్లు ఆరోగ్యానికి మంచిదే. కానీ, సిట్రస్ ఫ్రూట్స్ అయిన నిమ్మ, నారింజ వంటి వాటిని పరగడుపున తీసుకుంటే గ్యాస్ సమస్య వస్తుంది. ఎందుకంటే, సిట్రస్ జాతి పండ్లలో సిట్రిక్ యాసిడ్ పరిమాణం సహజంగానే ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు మన జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం విడుదలవుతుంది. ఆ సమయంలో ఈ పండ్లను తీసుకోవడం వల్ల పొట్టలో యాసిడ్ స్థాయిలు మరింత పెరిగిపోతాయి. ఫలితంగా, గ్యాస్, కడుపు ఉబ్బరం, గుండెల్లో మంట వంటి జీర్ణక్రియ సమస్యలు తలెత్తుతాయి.కాఫీ, టీలు ఉదయం లేవగానే కాఫీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. కానీ, ఏం తినకుండా ఇవి తీసుకుంటే ఎసిడిటీ ఇబ్బంది పెడుతుంది. పాలు, పంచదార వేసిన కాఫీ లేదా టీలను పరగడుపున తాగినప్పుడు, పాలలో ఉండే లాక్టోజ్, చక్కెర సులభంగా జీర్ణం కావు. ఇది పొట్టలో గ్యాస్ తయారవడానికి, కడుపు ఉబ్బరానికి కారణమవుతుంది.ఉదయాన్నే ఖాళీ కడుపుతో శీతల పానీయాలు తీసుకోకూడదు. వీటిలో ఉండే కార్బొనేటెడ్ పొట్ట ఉబ్బరాన్ని కలిగిస్తుంది.పరగడుపున తీపి పదార్థాలు తీసుకుంటే శరీరంలో ఇన్సులిన్ స్థాయిలు వేగంగా పెంచుతాయి. జీర్ణాశయంలోని ఎంజైములు బద్ధకంగా మారతాయి.నూనెలో డీఫ్ ఫ్రై చేసిన ఆహారాన్ని ఉదయాన్నే తీసుకోకూడదు. దీని వల్ల నీళ్లను ఎక్కువగా తాగడంతో పాటు పొట్ట ఉబ్బరం, అజీర్తి ఇబ్బంది పెడతాయి.పచ్చళ్లలో ఉప్పు, కారం, నూనె ఎక్కువగా ఉంటాయి. ఇవి గ్యాస్, అజీర్తిని కలిగిస్తాయి. కాబట్టి, టిఫిన్‌తో పాటు నిల్వ పచ్చళ్లు తీసుకోకపోవడమే ఉత్తమం.ఛీజ్‌లో కొవ్వు ఎక్కువగా ఉంటుంది. అందులోనూ హార్డ్ ఛీజ్, ఫ్యాట్ అధికంగా ఉండే పాల పదార్థాలను పరగడుపున తీసుకోవడం వల్ల అజీర్తి సమస్య ఏర్పడుతుంది.ఐస్‌క్రీమ్‌ని ఖాళీ కడుపుతో తీసుకుంటే జీర్ణ వ్యవస్థకు ఇబ్బంది కలిగిస్తుంది. ఫ్యాట్‌తో పాటు చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. వికారంతో పాటు అజీర్తి సమస్యలు వస్తాయిదానిమ్మ గింజలు ఆరోగ్యానికి మంచిదే. కానీ, పరగడుపున వీటిని తీసుకోకూడదు. వీటిల్లో ఉండే యాసిడ్ జీర్ణవ్యవస్థకు చిరాకుని కలగించడమే కాకుండా గుండెల్లో మంటగా అనిపిస్తుంది.

# టైమ్‌పాస్ కోసం 'సిగరెట్' తాగుతున్నారా ఈ హెచ్చరిక సంకేతాలతో అలర్ట్ కావాల్సిందే

**పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యానికి ప్రమాదం**

**ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దంటున్న నిపుణులు**



పొగాకు వాడకం అనేది ప్రారంభంలో ఎవరికీ ఒక వ్యసనంలా అనిపించదు. అది రోజువారీ జీవితంలో ఒక సాధారణ అలవాటుగా మెల్లగా మొదలవుతుంది. ఫ్రెండ్స్‌తో కలిసి సిగరెట్ పంచుకోవడం, ఒత్తిడితో కూడిన రోజువారీ పనిలో కాస్త విరామం తీసుకుని పొగతాగడం లేదా భోజనం తర్వాత గుట్కా/పొగాకు నమలడం వంటివి త్వరలోనే వదిలించుకోలేనంతగా ఒక దినచర్యగా మారిపోతాయి. ఈ అలవాటు ప్రారంభంలో అపాయం లేదని అనిపించినప్పటికీ, కాలక్రమేణా శరీరంలోని దాదాపు ప్రతి అవయవం క్రమంగా దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా తీవ్రమైన వ్యాధి బయటపడటానికి చాలా కాలం ముందే, శరీరం కొన్ని చిన్న చిన్న హెచ్చరిక సంకేతాలను ఇస్తుందంటున్నారు. మరి, ఆ ముందస్తు హెచ్చరిక సంకేతాలేంటో ఇప్పుడు చూద్దాం.శరీరంలోని దాదాపు ప్రతి అవయవాన్ని పొగాకు దెబ్బతీస్తుంది, దీనివల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులు, సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గడం, రోగనిరోధక శక్తి బలహీనపడటం, అకాల మరణం వంటివి సంభవిస్తాయని ఔనూ పేర్కొంది. ఈ క్రమంలో శరీరం ఇచ్చే హెచ్చరిక సంకేతాలు అకస్మాత్తుగా బయటపడవు. సాధారణంగా చాలా ఏళ్లపాటు పొగాకు వాడిన తర్వాతే ఇవి మెల్లగా కనిపిస్తాయి. ఈ నిదానమైన మార్పుల వల్లే చాలామంది "నేను బాగానే ఉన్నాను కదా" అని భ్రమపడుతుంటారు. కానీ, పొగాకు వల్ల వచ్చే తీవ్రమైన వ్యాధుల స్పష్టమైన సంకేతాలను మనం అస్సలు నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు.దీర్ఘకాలిక దగ్గు రెండు మూడు వారాల కంటే ఎక్కువ కాలం పాటు ఉంటూ, రోజురోజుకూ తీవ్రమయ్యే దగ్గును నిర్లక్ష్యం చేయవద్దని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, శ్వాస తీసుకునేటప్పుడు పిల్లికూతలు లేదా వింత శబ్దాలు లాంటిని అశ్రద్ధ చేయవద్దని అంటున్నారు.కారణం లేని అలసట చాలామంది కొద్ది దూరం నడిచినా లేదా రెండు మెట్లు ఎక్కినా శ్వాస ఆడకపోవడం, విపరీతంగా అలసిపోతుంటారు. అయితే, దీనిని సాధారణ అలసటగా తీసుకోవద్దని చెబుతున్నారు.బరువులో మార్పులు కొంతమంది ఎలాంటి ప్రయత్నం లేకుండానే హఠాత్తుగా బరువు తగ్గిపోతుంటారు. పొగాకు వాడకం వల్ల శరీరంలో అంతర్గతంగా మొదలయ్యే తీవ్రమైన వ్యాధులకు ఇది ఒక ముఖ్యమైన సంకేతం కావచ్చని నిపుణులు చెబుతున్నారు.రొమ్ము క్యాన్సర్ ముప్పును తగ్గించే సూపర్ ఫుడ్స్ - ఆహారంలో వీటిని చేర్చుకుంటే మేలంటున్న నిపుణులు.నోటి సమస్యలు పొగాకు వల్ల వచ్చే నోటి క్యాన్సర్ ప్రారంభంలో తగ్గని నోటి పూత (అల్సర్లు), నోటి లోపల తెల్లటి లేదా ఎర్రటి మచ్చలు, దవడ గట్టిపడటం వంటి రూపాల్లో కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మొదట్లో ఇవి పెద్దగా నొప్పి లేదా ఇబ్బంది కలిగించకపోవడం వల్ల చాలా మంది వీటిని నిర్లక్ష్యం చేస్తారట.గొంతు సమస్యలు గొంతు బొంగురుపోవడం లేదా నిరంతరం గొంతు మంటగా ఉండటం వంటి శాశ్వత మార్పులను తేలికగా తీసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఇవి లోపల పెరుగుతున్న తీవ్రమైన సమస్యలకు సంకేతాలు కావచ్చుంటున్నారు.ఈ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యమని పేర్కొంటున్నారు. దీనివల్ల శస్త్రచికిత్స వంటి కఠినమైన చికిత్సల అవసరం తప్పడమే కాకుండా, వ్యాధి నుంచి మరింత సులభంగా కోలుకోవచ్చని చెబుతున్నారు.ఊపిరితిత్తులు పొగాకు ప్రభావం కేవలం ఊపిరితిత్తులకే పరిమితం కాదట. ఇది శరీరం మొత్తాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల వచ్చే దీర్ఘకాలిక సమస్యల లక్షణాలను చాలామంది గుర్తించలేకపోతుంటారని అంటున్నారు. పొగ ఊపిరితిత్తులకు చేరినప్పుడు, అది అక్కడి చిన్న గాలి సంచులలోకి ప్రయాణించి వాటిని దెబ్బతీస్తుందని పేర్కొంది.గుండె, రక్తనాళాపై ఒత్తిడి పొగాకు వల్ల శరీరంలో విషపూరిత పదార్థాలు చేరుతాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల తరచుగా తల తిరగడం, ఛాతీ బరువుగా లేదా నొప్పిగా అనిపించడం వంటి తీవ్రమైన గుండె సమస్యల సంకేతాలు కనిపిస్తాయంటున్నారు.శారీరక అసౌకర్యం తరచూ వచ్చే తలనొప్పి లేదా కాళ్ల వాపు వంటి లక్షణాలను తేలికగా తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇవి పొగాకు వాడకం వల్ల రక్తనాళాలు దెబ్బతింటున్నాయని చెప్పడానికి సంకేతాలు కావచ్చుంటున్నారు.నివారణ మనకు అందుబాటులో ఉన్న అత్యంత ముఖ్యమైన పరిష్కారం సంక్లిష్టమైన శస్త్రచికిత్స కాదు. వ్యాధిని ప్రారంభ దశలోనే కచ్చితంగా గుర్తించాలని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల పెద్దగా కోతలు లేని సాధారణ చికిత్సలతోనే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలియజేస్తున్నారు.మానవ శరీరానికి స్వయంగా కోలుకునే అద్భుతమైన శక్తి ఉంది. పొగాకు వాడకాన్ని ఆపిన మరుక్షణమే, రక్తప్రసరణ పెరగడం, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడటం వంటి సానుకూల మార్పులు మొదలవుతాయని నిపుణులు చెబుతున్నారు.ధూమపానం మానేయడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్, జ్ఞాపక వంటి ధూమపాన సంబంధిత వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుందని జణజ పేర్కొంది.ఎప్పుడైనా తగ్గని దగ్గు, నోటిపూత లేదా విపరీతమైన అలసట వంటి సమస్యలు వేధిస్తుంటే, భవిష్యత్తులో వచ్చే పెద్ద పెద్ద ఆరోగ్య ముప్పులను నివారించడానికి వీలైనంత త్వరగా డాక్టర్‌ను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు.ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఆస్టియోపోరోసిస్, గౌట్.. రెండూ ఒకటే అనుకుంటున్నారా తేడా ఇదే




ఆధునిక జీవనశైలిలో అనేకమందిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ఎముకలు, కీళ్లకు సంబంధించినవి ప్రధానమైనవి. అయితే, చాలామంది ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత), గౌట్ (కీళ్లవాతం) రెండూ ఒకటేనని అపోహ పడుతుంటారు. వాస్తవానికి ఈ రెండు సమస్యల మధ్య చాలా తేడా ఉంది. వాటి కారణాలు, లక్షణాలు, చికిత్సా విధానాలు పూర్తిగా భిన్నం. ఈ రెండింటిపై సరైన అవగాహన కలిగి ఉండటం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం.

**ఆస్టియోపోరోసిస్ అంటే ఏమిటి**

ఆస్టియోపోరోసిస్ అంటే ఎముకలు గుల్లబారి, వాటి సాంద్రత తగ్గి, పెళుసుగా మారే పరిస్థితి. దీనివల్ల ఎముకలు సులభంగా విరిగిపోయే (ఫ్రాక్చర్) ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా వయసు పైబడిన వారిలో, మహిళల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కాల్షియం, విటమిన్ డి లోపం, వ్యాయామం లేకపోవడం, ధూమపానం, అధిక మద్యపానం వంటివి ఈ సమస్యకు దారితీస్తాయి. ఈ సమస్యను నిర్ధారించడానికి వైద్యులు డెక్సా స్కాన్ లేదా బీఎండీ పరీక్షను సూచిస్తారు. దీని ద్వారా ఎముకల సాంద్రతను కచ్చితంగా అంచనా వేయవచ్చు.

**గౌట్ ఎందుకు వస్తుంది**

మరోవైపు, గౌట్ అనేది జీవక్రియకు సంబంధించిన సమస్య. రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగినప్పుడు, అది సూది వంటి స్ఫటికాలుగా మారి కీళ్లలో పేరుకుపోతుంది. దీనివల్ల కీళ్లలో అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి, వాపు, ఎరుపెక్కిన చర్మం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా కాలి బొటనవేలు కీలులో ఈ నొప్పి ఎక్కువగా ఉంటుంది. అధికంగా మాంసం (రెడ్ మీట్), కొన్నిరకాల సముద్రపు ఆహారాలు, చక్కెర పానీయాలు, మద్యం సేవించడం వల్ల యూరిక్ యాసిడ్ పెరిగే ప్రమాదం ఉంది. సీరమ్ యూరిక్ యాసిడ్ రక్త పరీక్ష ద్వారా ఈ సమస్యను నిర్ధారిస్తారు. అవసరమైతే కిడ్నీ పనితీరును అంచనా వేసే పరీక్షలు కూడా చేస్తారు.

**ఆహారం, జీవనశైలి పాత్ర**

ఆస్టియోపోరోసిస్ నివారణకు పాలు, పెరుగు, ఆకుకూరలు, చేపలు వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. బరువులు మోసే వ్యాయామాలు, నడక ఎముకల బలాన్ని పెంచుతాయి. గౌట్ సమస్య ఉన్నవారు నీరు ఎక్కువగా తాగాలి. ప్యూరిన్లు అధికంగా ఉండే మాంసాహారం, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం మంచిది.అయితే, ఆహార నియమాలు పాటించడం మాత్రమే చికిత్స కాదని గుర్తుంచుకోవాలి. లక్షణాలను బట్టి సొంతంగా ఓ నిర్ధారణకు రావడం ప్రమాదకరం. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించి, సరైన పరీక్షలు చేయించుకుని, వారి సూచనల మేరకు చికిత్స తీసుకోవడం అత్యవసరం. సరైన అవగాహన, సకాలంలో చికిత్సతో ఈ రెండు సమస్యలనూ సమర్థంగా ఎదుర్కోవచ్చు.

# మీ శరీరానికి రోజూ సరిపడా ప్రొటీన్ ఇస్తున్నారా ఎవరెవరికి, ఎంత అవసరం

**నిశ్శబ్ద పోషకాహార సంక్షోభం దేశంలో 70-80**

**శాతం మందిలో ప్రొటీన్ లోపం**



శరీర నిర్మాణంలో ప్రొటీన్ పాత్ర కీలకం. దేహంలోని కణాలన్నింటికీ అవసరం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రొటీన్ శరీరానికి చోదక శక్తి లాంటిది. అయితే, ప్రొటీన్ లోపంతో బాధపడేవారి సంఖ్య దేశంలో ఎక్కువవుతోందని పలు నివేదికలు హెచ్చరిస్తున్నాయి. రోజువారీ ఆహారంలో ఎంత ప్రొటీన్ తీసుకోవాలి, ఏయే పదార్థాల్లో లభిస్తుందనే విషయం చాలామందికి తెలియడం లేదంటున్నాయి.దేశవ్యాప్తంగా 70-80 శాతం ప్రజల్లో ఈ లోపం ఉండగా, శాకాహారుల్లో మరింత ఎక్కువగా ఉందని గుర్తించారు. దీన్ని 'నిశ్శబ్ద పోషకాహార సంక్షోభం'గా పేర్కొంటూ, ఆహారంలో కార్బోహైడ్రేట్లకే అధిక ప్రాధాన్యతనివ్వడం, ఆధునిక జీవనశైలి, జంక్‌ఫుడ్స్, మైదాతో చేసిన తినుబండరాలు తినడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

**నివేదికలు ఏం చెబుతున్నాయి :**

దేశంలో ప్రొటీన్ లోపంపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఇండియన్ మార్కెట్ రీసెర్చ్ బ్యూరో తదితర సంస్థలు ఆసక్తికర విషయాలు వెల్లడించాయి.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం ప్రతి కిలో శరీర బరువుకు రోజుకి ఒక గ్రాము ప్రొటీన్ తీసుకోవాలి. సగటు భారతీయులు తీసుకునేది 0.8 గ్రాములే.ప్రపంచ జనాభాలో సగటున ఓ వ్యక్తి రోజుకి 68 గ్రాముల ప్రొటీన్ తీసుకుంటుండగా, భారత్‌లో అది కేవలం 47 గ్రాములుగా ఉంది.ఇండియన్ డైటెటిక్ అసోసియేషన్ ప్రకారం, 84 శాతం శాకాహారులు, 65 శాతం మాంసాహారులు ప్రొటీన్ లోపంతో బాధపడుతున్నారు.పట్టణ ప్రాంతాల్లో 70-80 శాతం మంది రోజువారీ ఆహారంలో కావలసినంత ప్రొటీన్ తీసుకోవడం లేదు.ప్రతి 10 మంది భారతీయుల్లో ఏడుగురు ప్రొటీన్ లోపంతో బాధపడుతున్నారు.73 శాతం యువత అవసరమైన దానికంటే తక్కువ ప్రొటీన్ తీసుకుంటున్నారు.మహిళలు ప్రత్యేకించి గృహిణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది.

**ఎవరెవరికి, ఎంతంటే :**

వయసు, లింగం, బరువు, చేసే పనుల ఆధారంగా రోజుకు ఎంత ప్రొటీన్ అవసరమనేది ఆధారపడి ఉంటుంది.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ మార్గదర్శకాల ప్రకారం 1 నుంచి మూడేళ్లున్న పిల్లల్లో బరువు ఆధారంగా కిలోకు 1.05 - 1.2 గ్రా ప్రొటీన్ అవసరం. 3 ఏళ్ల పిల్లల సాధారణ బరువు 14 కిలోలుంటే రోజుకు 14.7 నుంచి 16.8 గ్రా. ప్రొటీన్ ఇవ్వాలి. 4-8 ఏళ్లు (19 గ్రా), 9-13 ఏళ్లు (34 గ్రా), 14-18 వయసున్న అబ్బాయిలకు (52 గ్రా.), అమ్మాయిలకు (46 గ్రా.), 19-50 వయసున్న పురుషులకు (56 గ్రా.), మహిళలకు (46 గ్రా.), 50 ఏళ్లు, ఆపై ఉన్నవారికి 68-82 గ్రాములు అవసరం.శారీరక శ్రమ తక్కువగా ఉండే వారికి బరువు ఆధారంగా కిలోకు 0.8 నుంచి 1 గ్రాము ప్రొటీన్ అవసరం.రోజులో 7-8 గంటలు కూర్చొని పనిచేసే వారికి (సుమారు 60 కిలోలు) రోజుకు 48-60 గ్రాములు, ఒక వ్యక్తి (సుమారు 60 కిలోలు) రోజుకి కనీసం గంట వ్యాయామం, నడక, నిల్చొని పనిచేయడం, బరువులు ఎత్తడం చేస్తే 60-72 గ్రాములు. అయితే, గర్భిణులు, బాలింతలకు రోజుకి అదనంగా 10-15 గ్రాములు అవసరం.

**తీసుకోవాల్సినవి :**

ప్రొటీన్లు రెండు రకాలు. యానిమల్ బేస్డ్, ప్లాంట్ బేస్డ్. మాంసాహారులు వారానికి 3 రోజులు యానిమల్ బేస్డ్, 3 రోజులు ప్లాంట్ బేస్డ్ ప్రొటీన్‌ను మార్చి మార్చి తీసుకోవాలి.గుడ్లు, పాలు, పెరుగు, చేపలు, చీజ్, మాంసం తదితర ఉత్పత్తులు నాణ్యమైన ప్రొటీన్ వనరులు.పప్పుధాన్యాలు, బాదం, వేరుశనగ, క్వినోవా, తృణధాన్యాలు, సోయా, జీడిపప్పు, వాల్‌నట్స్, గుమ్మడి, పొద్దుతిరుగుడు గింజలు, నువ్వులు, అవిసె గింజలు, డెయిరీ ఉత్పత్తులుకొన్ని రకాల కూరగాయలు, పండ్లలోనూ ప్రొటీన్ లభిస్తుంది.జీర్ణాశయ సమస్యలున్నవారు అవి తగ్గేంత వరకు పప్పులు, ధాన్యాలు తీసుకోకపోవడం మంచిది.

**పరిశోధన మూలాలు :**

ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# 'స్నికర్స్' పేరుకు ఓ గుర్రంతో లింక్.. చాక్లెట్ పేరు వెనుక ఆసక్తికర కథ

**స్నికర్స్ చాక్లెట్ పేరుకు ఓ గుర్రంతో ఆసక్తికరమైన సంబంధం**

**మార్స్ కుటుంబం పెంచిన రేసు గుర్రం పేరు 'స్నికర్స్'**

**రేసుల్లో విజేతగా నిలిచిన గుర్రం**

**చాక్లెట్ విడుదలకు నెల రోజుల ముందే చనిపోయిన గుర్రం**

**దాని జ్ఞాపకార్థం చాక్లెట్‌కు 'స్నికర్స్' పేరు**




ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన చాక్లెట్ బార్ స్నికర్స్ పేరుకు ఓ గుర్రంతో సంబంధం ఉంది. స్నికర్స్ తయారీ సంస్థ మార్స్ తెలిపిన వివరాల ప్రకారం.. తొలి స్నికర్స్ బార్‌ను 1930లో అమెరికాలోని షికాగోలో తయారు చేశారు. కంపెనీ వ్యవస్థాపక కుటుంబానికి చెందిన గుర్రం పేరును ఈ చాక్లెట్‌కు పెట్టారు.మార్స్ కుటుంబం చాక్లెట్ వ్యాపారంలో విజయవంతమైన తర్వాత 3,000 ఎకరాల గుర్రాల పెంపకం ఫారాన్ని కొనుగోలు చేసింది. ఆ ఫారంలో పెంచిన రేసు గుర్రాల్లో స్నికర్స్ కూడా ఒకటి. అది రేసుల్లో విజేతగా నిలిచింది. అయితే కొత్త చాక్లెట్ బార్‌ను మార్కెట్లోకి తీసుకురావడానికి నెల రోజుల ముందే ఆ గుర్రం చనిపోయింది. దీంతో దాని జ్ఞాపకార్థం చాక్లెట్‌కు 'స్నికర్స్' అని పేరు పెట్టారు.మిల్క్ చాక్లెట్, కారమెల్, నౌగట్, వేరుశనగల కలయికతో రూపొందించిన ఈ బార్‌ను తొలిసారి కేవలం ఐదు సెంట్లకు విక్రయించారు. అనంతరం ఇది ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది.అయితే బ్రిటన్‌లో మాత్రం తొలుత 'స్నికర్స్' పేరుతో కాకుండా 'మారథాన్ బార్' పేరుతో విక్రయించారు. 'స్నికర్స్' అనే పేరు అక్కడి 'నికర్స్' అనే పదానికి దగ్గరగా ఉండటంతో వివాదం తలెత్తవచ్చని భావించి ఈ మార్పు చేశారు. కొంతకాలం తర్వాత మళ్లీ అసలు పేరైన స్నికర్స్‌నే కొనసాగిం చా రు.కాలక్రమంలో స్నికర్స్ ఫన్ సైజ్, ఐస్‌క్రీమ్ బార్, ఆల్మండ్, పీనట్ బటర్, పెకాన్ తదితర అనేక వేరియంట్లను తీసుకొచ్చింది. 2010లో "యూ ఆర్ నాట్ యూ వెన్ యూ ఆర్ హంగ్రీ" అనే ప్రకటనల ప్రచారం తర్వాత బ్రాండ్‌కు మరింత ప్రపంచవ్యాప్త గుర్తింపు వచ్చింది.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
సోమవారం 23 - 11 - 2026

# బెంగళూరు వాసులకు గుడ్ న్యూస్.. గోవాకు వందే భారత్ రైలు..!



బెంగళూరు-గోవా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ శుక్రవార ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం డీకే శివకుమార్ కలిసి ప్రారంభించారు. బెంగళూరు, మంగళూరు, మార్గావ్ (గోవా) నగరాల మధ్య ఈ రైలు కనెక్టివిటీని పెంచనుంది. ఈ కొత్త వందే భారత్ సర్వీసు విద్యుదీకరించిన మార్గంలో నడుస్తుంది. దీనివల్ల డీజిల్ ఇంధనంపై ఆధారపడటం తగ్గుతుంది. బెంగళూరు, తీరప్రాంత కర్ణాటక, గోవా మధ్య రైలు అనుసంధానాన్ని మెరుగుపరచడానికి ఈ కొత్త యశ్వంతపూర్-మడ్గావ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టారు. ఈ రైలు హసన్, సకలేశ్‌పుర, సుబ్రహ్మణ్య రోడ్, మంగళూరు, ఉడిపి, కుందాపుర, మురుడేశ్వర, గోకర్ణ, కార్వార్ వంటి పలు కీలక స్టేషన్లకు నేరుగా ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తుంది. నవంబర్ 13న రెండు ప్రత్యేక ప్రారంభ సర్వీసులు నడిచిన తర్వాత నవంబర్ 15 నుంచి ఈ రైలు సాధారణ ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని నైరుతి రైల్వే పేర్కొంది. నైరుతి రైల్వే నవంబర్ 15, 2026 నుండి యశ్వంతపూర్-మడ్గావ్-యశ్వంతపూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైలు నంబర్ 26655 యశ్వంతపూర్ జంక్షన్ నుంచి ఉదయం 7:35 గంటలకు బయల్దేరుతుంది. రాత్రి 8:55 గంటలకు మడ్గావ్ చేరుకుంటుంది. ఈ రైలు శ్రావణ బెళగొళకు ఉదయం 9:03 గంటలకు చేరుకుంటుంది. హసన్ కు ఉదయం 9:38, సకలేశ్‌పురకు ఉదయం 10:20, సుబ్రహ్మణ్య రోడ్ కు మధ్యాహ్నం 12:40, కబాకపుత్తూరుకు మధ్యాహ్నం 1:25, మంగళూరు జంక్షన్ కు మధ్యాహ్నం 3:05, ఉడిపికి సాయంత్రం 4:20, కుందాపురకు సాయంత్రం 4:38, మూకాంబికా రోడ్ బైందూరుకు సాయంత్రం 5:20, మురుడేశ్వరకు సాయంత్రం 6:00, గోకర్ణ రోడ్ కు సాయంత్రం 7:00, కార్వార్ సాయంత్రం 7:45 గంటలకు చేరుకుంటుంది. డిపాజిట్ తిరిగివ్వని బెంగళూరు ఓనర్‌కు కోర్టు షాక్.. 80 వేల డిపాజిట్‌ను 9% వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశాలు.. ఈ రైలు వారంలో ఆరు రోజులు (బుధవారం మినహా) నడుస్తుంది. మొత్తం ప్రయాణ సమయం 13 గంటల 20 నిమిషాలు ఉంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 26656 మడ్గావ్ నుంచి ఉదయం 8:20 గంటలకు బయల్దేరుతుంది. రాత్రి 9:15 గంటలకు యశ్వంతపూర్ జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ రైలు కార్వార్ కు ఉదయం 9:03, గోకర్ణ రోడ్ కు ఉదయం 9:48, మురుడేశ్వర్ కు ఉదయం 11:00, మూకాంబికా రోడ్ బైందూర్ కు ఉదయం 11:20, కుందాపురకు ఉదయం 11:48, ఉడిపికి మధ్యాహ్నం 12:18, మంగళూరు జంక్షన్ కు మధ్యాహ్నం 1:50, కబాకపుత్తూరు కు మధ్యాహ్నం 2:43, సుబ్రహ్మణ్య రోడ్ కు మధ్యాహ్నం 3:28 , సకలేశ్‌పురకు సాయంత్రం 5:30, హాసన్ కు సాయంత్రం 6:13, శ్రావణబెళగొళకు సాయంత్రం 6:43 గంటలకు చేరుకుటుంది. మొత్తం ప్రయాణ సమయం 12 గంటల 55 నిమిషాలు ఉంటుంది. ఈ తిరుగు ప్రయాణ సేవ గురువారాలు తప్ప,వారానికి ఆరు రోజులు అందుబాటులో ఉంటుంది. రెండు రైళ్లలోనూ 16 కోచ్‌లు ఉంటాయి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# రాత్రికి రాత్రే కోటీశ్వరులైన ఉద్యోగులు

## వారి తలరాతను మార్చిన కంపెనీ షేర్లు..




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దిగ్గజం ఆంత్రోపిక్ ఇటీవలి పబ్లిక్ ఇష్యూ తర్వాత.. ఆ సంస్థ వ్యవస్థాపకులు బిలియనీర్లుగా, ఉద్యోగులు రాత్రికి రాత్రే మిలియనీర్లుగా మారడం ప్రపంచ వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశమైంది. 2021లో ఓపెన్‌ఏఐ నుండి బయటకు వచ్చి ఆంత్రోపిక్‌ను స్థాపించిన ఏడుగురు సహ-వ్యవస్థాపకుల ఉమ్మడి సంపద ప్రస్తుతం దాదాపు రూ. 8.97 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది బిలియనీర్లను సృష్టించిన కంపెనీలపై.. ప్రముఖ ట్రేడింగ్ సంస్థ అట్మోస్ నవంబర్ 2026లో నిర్వహించిన తాజా అధ్యయనం ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దాదాపు 100 అగ్రశ్రేణి కంపెనీలను పరిశీలించిన ఈ నివేదికలో.. కేవలం కంపెనీని స్థాపించడం లేదా అందులో ఉద్యోగులుగా పనిచేయడం ద్వారా ఫోర్బ్స్ రియల్-టైమ్ బిలియనీర్ల జాబితాలో చోటు సంపాదించిన వారిని మాత్రమే లెక్కలోకి తీసుకున్నారు. బిలియనీర్ల సంఖ్య పరంగా ఆంత్రోపిక్ (7 మంది) అగ్రస్థానంలో ఉన్నప్పటికీ.. మొత్తం సంపద విలువ విషయంలో గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. ఆల్ఫాబెట్‌తో అనుబంధం ఉన్న ఐదుగురు బిలియనీర్ల ఉమ్మడి నికర విలువ ఏకంగా రూ. 51.98 లక్షల కోట్లుగా నమోదైంది. ఇందులో సహ-వ్యవస్థాపకులు లారీ పేజ్ (రూ. 25.14 లక్షల కోట్లు), సెర్గే బ్రిన్ (రూ. 23.13 లక్షల కోట్లు) ప్రధాన వాటాను కలిగి ఉండగా.. మాజీ సీఈఓ ఎరిక్ ష్మిత్, ప్రస్తుత సీఈఓ సుందర్ పిచాయ్, తొలి ఉద్యోగిని మరిస్సా మేయర్ ఈ జాబితాలో ఉన్నారు. ఆ తర్వాత ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ఆరుగురు బిలియనీర్లతో రెండో స్థానంలో నిలిచింది. సహ-వ్యవస్థాపకులు మార్క్ జుకర్‌బర్గ్, ఎడ్వర్డో సావెరిన్, డస్టిన్ మోస్కోవిట్జ్‌లతో పాటు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేసిన సీన్ పార్కర్, షెరిల్ శాండ్‌బర్గ్, జెఫ్ రోత్‌షీల్డ్‌ల ఉమ్మడి సంపద రూ. 24.71 లక్షల కోట్లుగా ఉంది. నాడు ఏఐని శాసించిన దిగ్గజం నేడు దీన స్థితిలో.. రూ. లక్షల కోట్ల నష్టాలతో భోరుమంటున్న ఇన్వెస్టర్లు.. మరోవైపు, రష్యన్ బ్యాంకింగ్ దిగ్గజం 'అల్ఫా గ్రూప్'లో ముగ్గురు వ్యవస్థాపకులు (మిఖాయిల్ ఫ్రిడ్‌మన్, జర్మన్ ఖాన్, అలెక్సీ కుజ్మిచెవ్), ముగ్గురు ఉన్నతోద్యోగులతో కలిపి ఆరుగురు బిలియనీర్లు రూ. 4.17 లక్షల కోట్ల సంపదను ఆర్జించారు. స్విస్ మైనింగ్ సంస్థ 'గ్లెన్‌కోర్' ఇందులో ఒక ప్రత్యేకమైన ఉదాహరణగా నిలిచింది. ఇందులో ఒక్కరు కూడా వ్యవస్థాపకులు కానప్పటికీ, మాజీ సీఈఓ ఇవాన్ గ్లాసెన్‌బర్గ్ సహా ఆరుగురు ఉన్నత కార్యనిర్వాహకులు ఏకంగా రూ. 2.73 లక్షల కోట్ల సంపదను కూడబెట్టారు. ఆసియా నుండి చైనా కంపెనీలు సత్తా చాటగా.. బ్యాటరీ దిగ్గజం జూహూ (5 గురు బిలియనీర్లు - రూ. 5.92 లక్షల కోట్లు).. స్మార్ట్‌ఫోన్ సంస్థ షియోమి (5 గురు - రూ. 3.38 లక్షల కోట్లు), ఫోషాన్ హైటియన్ (5 గురు - రూ. 1.39 లక్షల కోట్లు) జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇక ఈ ప్రతిష్ఠాత్మక ప్రపంచ జాబితాలో చోటు సంపాదించిన ఏకైక భారతీయ కంపెనీగా ఐటీ దిగ్గజం 'ఇన్ఫోసిస్' నిలిచింది. ఇన్ఫోసిస్‌ను స్థాపించిన ఐదుగురు బిలియనీర్ వ్యవస్థాపకుల ఉమ్మడి సంపద సుమారు రూ. 1.25 లక్షల కోట్లుగా అట్మోస్ నివేదిక అంచనా వేసింది. సరైన సమయంలో ఒక వినూత్న సంస్థను ప్రారంభించడం లేదా ప్రారంభ దశలో ఉద్యోగులుగా చేరి కంపెనీ వృద్ధిలో భాగస్వాములు కావడం ద్వారా అపారమైన సంపదను సృష్టించవచ్చని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# స్వీపం గా పని చేసిన బ్యాంకులోనే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగిన మహిళ..!



జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. మనం లైఫ్ ప్లాన్ చేసుకోవాలనుకుంటే.. దేవుడే మన లైఫ్ ను ప్లాన్ చేస్తాడు. ఇలానే ఓ మహిళ బ్యాంకులో స్వీపర్ గా జాయిన్ అయింది. కొద్ది సంవత్సరాల తర్వాతే అదే బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అయింది. ఈ స్థాయికి చేరుకోవడంలో ఆ మహిళ పట్టుదల, కృషి చాలానే ఉంది. మన పట్టుదల, భగవంతుడి అనుగ్రహం ఏదైనా సాధించవచ్చని ఆ మహిళా మణి నిరూపించారు. ఇంతకీ ఆ మహిళ ఎవరూ.. స్వీపర్ నుంచి జనరల్ మేనేజర్ స్థాయికి ఎలా ఎదిగిందో చూద్దాం. మహారాష్ట్రంలోని ముంబైకి కొంత దూరంలో ఉన్న గ్రామంలో నిరుపేద కుటుంబంలో ఓ ఆడ బిడ్డ పుట్టింది. తల్లిదండ్రులు ఆమెకు తోండ్వాల్కర్ అని పేరు పెట్టారు. ఆమెకు చదువు అంటే చాలా ఇష్టం. అది గమనించిన తల్లిదండ్రులు ఆమెను బడికి పంపారు. ఆర్థిక పరిస్థితులు దిగజారడంతో ఆమెను స్కూల్ మాన్పించి.. పనికి పంపారు. ఆ తర్వాత 17 ఏళ్ల వయసులోనే ఆమెకు పెళ్లి చేశారు. ఆమె సదాశివ్ అనే వ్యక్తిని పెళ్లాడింది. సదాశివ్ ముంబైలోని ఓ స్టేట్ బ్యాంక్ ఇండియా బ్రాంచ్ లో బుక్ బైండర్ గా పని చేసేవాడు. ఈ క్రమంలోనే వారికి ఓ బాబు పుట్టాడు. ఒక రోజు వీరి కుటుంబం బస్సులో ప్రయాణం చేస్తుండగా.. రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సదాశివ్ చనిపోయారు. దీంతో తండ్వాల్కర్ 20 వయస్సులో భర్తను కోల్పోయి.. కొడుతో ఒంటరైంది. ఈశ్వరన్ ఆరుముగం: రైతు బిడ్డ.. కోట్లు సంపాదించిన సాఫ్ట్‌వేర్ కంపెనీ అధిపతి! అయితే ఆమె భర్త పని చేస్తున్న బ్యాంకులోకి వెళ్లి పని కావాలని కోరింది. దీంతో దరఖాస్తు చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ చెప్పాడు. ఆమె దరఖాస్తు చేసుకుంది. దాదాపు రెండు నెలల తర్వాత అదే బ్రాంచ్ లో స్వీపర్ గా తీసుకున్నారు. ఆమె నెలకు రూ.65 జీతంతో పని చేశారు. అయితే ఆమెకు చదువు పై ఉన్న ఇష్టం పోలేదు. దీంతో సెకండ్ హ్యాండ్ 8,9, 10 తరగతుల బుక్స్ కొనుగోలు చేసి చదువుకుంది. 10 పాస్ అయింది. ఆ తర్వాత ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ లో పూర్తి చేసింది. ఈ క్రమంలోనే తన కొడుకును బండి పంపడం, ఇంటి అవసరాలు తీర్చుకోవడం కోసం కష్టపడింది. ఈ క్రమంలోనే ఎస్బీఐలో ఇంటర్నల్ పోస్టులు పడ్డాయి. దీంతో ఆమె దరఖాస్తు చేసి మొదటగా క్లార్క్ గా ఉద్యోగం సాధించారు. ఈ క్రమంలోనే ఆమె ప్రమోద్ ను రెండో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత క్రమంగా ప్రమోషన్లు పొందారు, క్లార్క్ నుంచి నుంచి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు. చీపురుతో ఊడ్చిన బ్యాంకులోనే పెన్ను పట్టి ఆఫిసర్ గా మారిన తోండ్వాల్కర్ ప్రతి ఒక్కరికి ఆదర్శమే. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# యాక్సెంచర్ బోనస్: షాకింగ్ ట్విస్ట్! జీతాల పెంపు కథ ఏమైంది




ప్రపంచ ప్రఖ్యాత ఐటీ దిగ్గజం యాక్సెంచర్ తన ఉద్యోగులకు బోనస్‌ను ప్రకటించింది. సాధారణంగా ఐటీ కంపెనీలు ఉద్యోగులకు ఇచ్చే జీతంతో పాటు బోనస్‌లు కూడా అందిస్తుంటాయి. అదే కోవలో యాక్సెంచర్ కూడా ఈ బోనస్ ప్రకటనను విడుదల చేసింది. యాక్సెంచర్‌లో పనిచేస్తున్న 8 లక్షల మంది ఉద్యోగుల్లో అత్యధికులు భారతీయులే. అందుకే ఈ సంస్థ చేసే ఏ ప్రకటన అయినా వేలాది మంది ఐటీ ఉద్యోగులపై ప్రభావం చూపుతుంది. ఈసారి, ఉద్యోగుల పనితీరు ఆధారంగా భారతీయ ఉద్యోగులకు 8% నుంచి 26% వరకు బోనస్ ప్రకటించింది. ఉద్యోగుల పనితీరు, నైపుణ్యాలు, సీనియారిటీ ఆధారంగా 8% నుంచి 26% వరకు బోనస్ మొత్తాన్ని అందించింది. కంపెనీ అంచనాలకు తగ్గట్టుగా అద్భుతమైన పనితీరు కనబరిచిన వారికి ఈ బోనస్ లభించింది. అదే సమయంలో, కంపెనీ ఆశించిన స్థాయిలో రాణించని ఉద్యోగులకు ఈసారి బోనస్ ఇవ్వలేదని సమాచారం. జెన్సన్ హువాంగ్ రాజీనామా: ఎన్విడియాలో అసలు ఏం జరిగింది ఉద్యోగులకు బోనస్‌ల విషయంలో మంచిగానే వ్యవహరించినా, చాలా మంది ఉద్యోగులకు ఏటా ఇచ్చే జీతాల పెంపును మాత్రం తాత్కాలికంగా నిలిపివేసింది. కంపెనీ ఖర్చులను నియంత్రించుకోవడానికి, స్థూల ఆర్థిక పరిస్థితులను ఎదుర్కోవడానికే యాక్సెంచర్ జీతాల పెంపును తాత్కాలికంగా ఆపేసినట్లు తెలుస్తోంది. యాక్సెంచర్ కంపెనీలో ప్రతి నలుగురిలో ముగ్గురు ఉద్యోగులు భారత్‌లోనే పనిచేస్తున్నారు. కాబట్టి, జీతాలు, బోనస్‌లకు సంబంధించి కంపెనీ తీసుకునే ఇలాంటి నిర్ణయాలు భారత టెక్నాలజీ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. 2023, 2024 సంవత్సరాల్లో ఉద్యోగులకు జీతాల పెంపును నిలిపివేసిన ఈ సంస్థ, గత ఏడాది జూన్‌లో నామమాత్రపు పెంపును ఇచ్చింది. ఏడాది గడిచినా, ఇప్పటికీ జీతాల పెంపుపై ఎలాంటి ప్రకటన చేయలేదు. మైక్రోసాఫ్ట్ సర్వర్లు ఎందుకు డౌన్ అయ్యాయి.. ఇమెయిల్ నుండి సేవల వరకు ఆగిపోవడానికి ప్రధాన కారణం ఏంటంటే.. గత కొన్నేళ్లుగా యాక్సెంచర్ ఉద్యోగులకు జీతాల పెంపు, ప్రమోషన్లు ఇవ్వకుండా దాటవేస్తోంది. ఐటీ కంపెనీలకు గత కొన్ని సంవత్సరాలుగా సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. ఏఐ రాక, అమెరికా ఆర్థిక మాంద్యం వంటి కారణాలతో కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకోవడం, జీతాల పెంపును నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయి.

# రికార్డు స్థాయిలో కుప్పకూలిన బిట్ కాయిన్ ధర

## భోరుమంటున్న క్రిప్టోకరెన్సీ షేర్ హోల్డర్లు..




ప్రపంచ క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో నెలకొన్న తీవ్ర అస్థిరత ఇప్పుడు ఈక్విటీ మార్కెట్లను కూడా కుదిపేస్తోంది. అగ్రశ్రేణి క్రిప్టోకరెన్సీ 'బిట్‌కాయిన్' ధర వరుసగా పతనమవుతూ గత మూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో.. క్రిప్టో మైనింగ్, ట్రేడింగ్, ఎక్స్ఛేంజ్ కార్యకలాపాల్లో ఉన్న అంతర్జాతీయ కంపెనీల షేర్లు భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అమెరికాలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ఫెడరల్ రిజర్వ్ డిసెంబర్‌లో వడ్డీ రేట్లను మరింత పెంచవచ్చన్న భయాలు, బలపడుతున్న డాలర్ విలువ పెట్టుబడిదారులను రిస్క్ ఆస్తులైన క్రిప్టోకరెన్సీల నుండి దూరం చేస్తున్నాయి. దీనికి తోడు ఇటీవల ఇరాన్-అమెరికా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు తమ పెట్టుబడులను సురక్షిత సాధనాల వైపు మళ్లిస్తుండటం బిట్‌కాయిన్ పతనానికి ప్రధాన కారణమైంది. బిట్‌కాయిన్ ధర తగ్గుదల ప్రభావం నేరుగా క్రిప్టో మైనింగ్ కంపెనీల ఆదాయ మార్జిన్లపై పడుతుండటంతో.. ఆయా సంస్థల స్టాక్‌లు తీవ్రంగా నష్టపోతున్నాయి. తాజా ట్రేడింగ్ గణాంకాల ప్రకారం.. ప్రముఖ మైనింగ్ సంస్థ 'హట్ 8' 8 షేర్లు ఏకంగా 6 శాతం కుప్పకూలాయి. అదేవిధంగా మరో రెండు దిగ్గజ బిట్‌కాయిన్ మైనింగ్ కంపెనీలు 'రియోట్ ప్లాట్‌ఫామ్స్' మరియు 'మారా హోల్డింగ్స్' ఒక్కొక్కటి 3.9 శాతం చొప్పున నష్టాలను చవిచూశాయి. విద్యుత్ మరియు నిర్వహణ ఖర్చులు స్థిరంగా ఉన్నప్పటికీ, తాము వెలికితీసే బిట్‌కాయిన్ల విలువ పడిపోవడం ఈ మైనింగ్ కంపెనీల లాభదాయకతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బిట్‌కాయిన్ మళ్లీ కుప్పకూలబోతుందా.. కొంటే రోడ్డు పాలేనా.. బెంజమిన్ కోవెన్ అంచనాలివిగో.. కేవలం మైనింగ్ సంస్థలే కాకుండా, క్రిప్టో ట్రేడింగ్ సేవలు అందించే ప్లాట్‌ఫామ్‌లు, భారీ ఎత్తున బిట్‌కాయిన్ నిల్వలు కలిగిన కార్పొరేట్ సంస్థల షేర్లు కూడా ఇన్వెస్టర్ల అమ్మకాలకు గురయ్యాయి. రిటైల్ ట్రేడింగ్ యాప్ 'రాబిన్‌హుడ్' షేర్లు 3.2 శాతం క్షీణించగా, బిట్‌కాయిన్‌ను తమ ప్రధాన రిజర్వ్ ఆస్తిగా కలిగి ఉన్న 'స్ట్రాటజీ.కామ్' షేర్లు 2.1 శాతం మేర పడిపోయాయి. ఇక అమెరికాకు చెందిన అతిపెద్ద క్రిప్టో ఎక్స్ఛేంజ్ 'కాయిన్‌బేస్' షేర్లు సైతం 0.5 శాతం నష్టంతో ట్రేడయ్యాయి. క్రిప్టో మార్కెట్లో ట్రేడింగ్ వాల్యూమ్‌లు తగ్గితే ఎక్స్ఛేంజ్‌ల కమీషన్ ఆదాయానికి గండిపడుతుందన్న ఆందోళన ఇందుకు కారణమైంది. ఈ గణాంకాలను బట్టి చూస్తే బిట్‌కాయిన్ బలహీనత కేవలం డిజిటల్ కరెన్సీలకే పరిమితం కాకుండా.. వాటితో ముడిపడి ఉన్న స్టాక్ మార్కెట్ రంగాలను కూడా తనతో పాటు కిందికి లాగుతోందని స్పష్టమవుతోంది. అటు స్పాట్ బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌ల నుండి సంస్థాగత మదుపర్ల నిధులను ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. రాబోయే రోజుల్లో విడుదల కానున్న అమెరికా ఆర్థిక గణాంకాలు, ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయాలపైనే బిట్‌కాయిన్ తదుపరి కదలికలు ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బిట్‌కాయిన్ తన కీలక మద్దతు స్థాయిలను నిలబెట్టుకోలేకపోతే, క్రిప్టో ఆధారిత షేర్లలో మరికొంత కాలం పాటు ఒడుదొడుకులు కొనసాగే అవకాశం ఉన్నందున మదుపర్లు అప్రమత్తంగా ఉండాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# అక్టోబర్‌లో మ్యూచువల్ ఫండ్లు కొనుగోలు చేసిన లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ ఇవే..!




అక్టోబర్ లో మ్యూచువల్ ఫండ్ మేనేజర్లు కొన్ని కంపెనీలలో తమ పెట్టుబడులను పెంచుకుంటూ, మరికొన్నింటిలో తమ వాటాలను తగ్గించుకున్నారు. మ్యూచువల్ ఫండ్లు కొనుగోలు చేసిన, అలాగే విక్రయించిన లార్జ్, మిడ్, స్మాల్-క్యాప్ స్టాక్స్ ఉన్నాయి. అక్టోబర్ 2026లో మ్యూచువల్ ఫండ్ షేర్ హోల్డింగ్స్‌లో అత్యధిక పెరుగుదల, తగ్గుదలను నమోదు చేసిన ప్రతి మార్కెట్-క్యాప్ విభాగంలోని స్టాక్స్ ఏమిటో చూద్దాం. మ్యూచువల్ ఫండ్లు అక్టోబర్ లార్జ్ క్యాప్ స్టాక్ అయిన మాక్స్ హెల్త్‌కేర్ హోల్డింగ్స్ పెంచుకున్నాయి. మ్యూచువల్ ఫండ్స్ వద్ద ఉన్న ఈ కంపెనీ షేర్ల సంఖ్య నెలవారీగా 15.6 శాతం పెరిగి 2.10 కోట్లకు చేరుకుంది. దీని తర్వాత ఐటీసీ నిలిచింది. మ్యూచువల్ ఫండ్ షేర్ హోల్డింగ్స్ 13.3% పెరిగి 235.41 కోట్ల షేర్లకు చేరుకున్నాయి. మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్స్‌లో పెరుగుదలను చూసిన లార్జ్-క్యాప్ స్టాక్‌లలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, నెస్లే ఇండియా కూడా ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్లు లార్జ్ క్యాప్ స్టాక్ ల్లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లను ఎక్కువగా విక్రయించారు. ఫండ్ల హోల్డింగ్స్ నెలవారీగా 3.5% తగ్గి 24.92 కోట్ల షేర్లకు పడిపోయాయి. బజాజ్ ఆటో 3.4% క్షీణతతో దాని తర్వాతి స్థానంలో నిలవగా, కోల్ ఇండియా మ్యూచువల్ ఫండ్ వాటాలు 2.5% తగ్గాయి. ఇన్ఫోసిస్, ఓఎన్‌జీసీలలో కూడా వాటాలు చెరో 2.1% మేర తగ్గాయి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి తగ్గిన పెట్టుబడులు..! మిడ్-క్యాప్ స్టాక్స్‌లో రైల్ వికాస్ నిగమ్ స్టాక్ ను మ్యూచువల్ ఫండ్ ఎక్కువగా హోల్డ్ చేస్తున్నాయి. మ్యూచువల్ ఫండ్స్ వద్ద ఉన్న షేర్ల సంఖ్య నెలవారీగా 25.4% పెరిగి 0.63 కోట్లకు చేరుకుంది. దీని తర్వాత ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ నిలిచింది. మ్యూచువల్ ఫండ్ల వద్ద వీటి షేర్లు 18.4% పెరిగి 3.17 కోట్ల షేర్లకు చేరుకున్నాయి. మ్యూచువల్ ఫండ్లు మిడ్ క్యాప్ స్టాక్ ల్లో పతంజలి ఫుడ్స్ షేర్లను ఎక్కువగా విక్రయించాయి. దీని తర్వాత సుజ్లాన్ ఎనర్జీ 14.7% క్షీణతతో నిలవగా, ఎల్‌ఐసి హౌసింగ్ ఫైనాన్స్ 8.2% పతనాన్ని నమోదు చేసింది. స్మాల్-క్యాప్ స్టాక్స్‌లో సెమిండియా ప్రాజెక్ట్స్ లో మ్యూచువల్ ఫండ్లు వాటాలను పెంచుకున్నాయి. నాట్కో ఫార్మా ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. మ్యూచువల్ ఫండ్లలో ఈ కంపెనీ షేర్ల232.5% పెరిగి 1.31 కోట్ల షేర్లకు చేరుకున్నాయి. స్మాల్ క్యాప్ విభాగంలో మ్యూచువల్ ఫండ్లు ఐడిబిఐ బ్యాంక్ షేర్లను ఎక్కువగా విక్రయించాయి. ఆ తర్వాతి స్థానంలో ఎమ్వీ ఫోటోవోల్టాయిక్ ఉంది. ఆ తర్వాత చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ ఉంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ




## 'జనవరి 12 విడుదల' నుంచి ఫస్ట్ సింగిల్ 'దివికి దివికి' విడుదల!

ఆగ్ర కథానాయకులు విక్టరీ వెంకటేష్, సందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'జనవరి 12 విడుదల'. సంక్రాంతి బాసుగా జనవరి 12న ఈ చిత్రం విడుదల బాజోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లను చిత్రబృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట 'దివికి దివికి' సంబంధించిన సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేసింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా.. మధుప్రియ, హరిప్రియ కలిసి పాడారు. అనంత్ శ్రీరామ్ లిరిక్స్ అందించాడు. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కలిసి నటిస్తున్న తొలి చిత్రం కావడంతో 'జనవరి 12 విడుదల'పై ఆరంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరిద్దరి సరసన కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

## ఇదెక్కడి ట్విస్ట్.. హనుమాన్ సీక్వెల్లో మెగా హీరో..!

ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ మూవీ హనుమాన్. తేజ సజ్జా హీరోగా వచ్చిన ఈ సినిమా.. బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ మూవీకి సీక్వెల్ జై హనుమాన్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుతం సీక్వెల్‌తో ఫుల్ బిజీగా ఉన్నారు ప్రశాంత్ వర్మ. ఈ చిత్రంలో కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా కనిపించనున్నారు.

తాజాగా ఈ సీక్వెల్ తెరకెక్కుతుండగానే టాలీవుడ్‌లో మరో బిగ్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. మెగా హీరో వైష్ణవ్ తేజ్ లీడ్ రోల్లో హనుమాన్-ది రైజ్ ఆఫ్ వానరాస్(హనుమాన్-2) మూవీ ప్రకటించారు. ఈ చిత్రానికి వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. దీంతో టాలీవుడ్ ఫ్యాన్స్ డైలామాలో పడ్డారు. అసలు ఇది హనుమాన్ సీక్వెల్ మూవీనా?.. లేదంటే కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారా అనేది తెలియాల్సి ఉంది. ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో వచ్చిన హనుమాన్ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ ప్రాజెక్ట్ ప్రకటించడం మరో విశేషం. అయితే అయితే పార్ట్ -1 నిర్మించిన ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ వారు కూడా ఇప్పుడు 'హను మాన్ 2' ని మరో హీరోతో తీసుకురాబోతున్నట్లుగా ఇటీవల రూమర్స్ గట్టిగా వినిపించాయి. తాజాగా అదే సమయంలో వాటిని నిజం చేస్తూ మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చి షాకిచ్చారు. మెగా యంగ్ హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా పెట్టి హనుమాన్- 2 ప్రీ లుక్ పోస్టర్ రిలీజ్ చేయడం టాలీవుడ్‌లో ఆసక్తిగా మారింది.




## బెల్లంకొండ 'హైందవ' విడుదలకు బ్రేక్.. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తామన్న మేకర్స్!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త జంటగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'హైందవ' విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ మూన్‌షైన్ పిక్చర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఈ ఏడాది నవంబర్ 27న థియేటర్లలో విడుదల కావాల్సి ఉంది. అయితే అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఒక మంచి సినిమాటిక్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు నిర్మాతలు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని పేర్కొంటూ, ప్రేక్షకుల సహనానికి, నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో విడుదలైన ఈ సినిమా టీజర్‌కు సినీ ప్రియుల నుంచి విశేష స్పందన లభించింది. రంగాపురం అనే గ్రామ నేపథ్యంలో సాగే ఈ మిస్టరీ థ్రిల్లర్ కథాంశం ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామంలోని ఒక పురాతన ఆలయంలోని విగ్రహాలన్నీ మాయమవడం, అదే సమయంలో ఒక గ్రామస్థుడు హత్యకు గురికావడంతో కథ మలుపు తిరుగుతుంది. అయితే నిర్దేశ గడువులోగా ఆ విగ్రహాలన్నీ తిరిగి వస్తాయని ఆలయ పూజారి విశ్వసిస్తుంటారు. ఈ వింత కేసును దర్యాప్తు చేసేందుకు దేవుడి కంటే మానవత్వాన్ని నమ్మే ఒక నాస్తికుడైన పోలీసు అధికారి రంగంలోకి దిగడంతో నమ్మకానికి, హేతువాదానికి మధ్య జరిగే ఆసక్తికరమైన సంఘర్షణతో ఈ చిత్రం సాగనుంది. మహేష్ చందు నిర్మిస్తున్న ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నాస్తిక పోలీసు అధికారిగా నటిస్తుండగా, సంయుక్త కథానాయికగా కనిపించనుంది. ఆలయ పూజారి పాత్రలో మహేష్ మంజ్రేకర్ కీలక పాత్ర పోషిస్తుండగా, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఆకట్టే థ్రిల్లర్‌కు సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, హరీష్ కన్నన్ సినిమాటోగ్రఫీ, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## కూతురితో సరదాగా .. ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసిన అల్లు అర్జున్!



బాస్ స్టార్ అల్లు అర్జున్ తన సినిమాలతోనే కాకుండా కుటుంబానికి సంబంధించిన మధురమైన క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. ముఖ్యంగా తన పిల్లలతో కలిసి గడిపే సమయానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులను ఆనందపరుస్తుంటారు. తాజాగా తన గారాల పట్టి అల్లు అర్హా పుట్టినరోజు సందర్భంగా అల్లు అర్జున్ చేసిన ఓ ప్రత్యేక పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో నెరల్‌గా మారింది. నేడు అల్లు అర్హా పుట్టినరోజు కావడంతో బన్నీ తన కుమార్తెకు ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అల్లు అర్హాతో కలిసి ఉన్న ఓ అందమైన ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. ఈ ఫొటోకు అదిరిపోయే క్యాప్షన్ కూడా జోడించారు. నా జీవితంలోని ఆనందానికి పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ చారాశ్రీశ్రీబాగాతీష్ణు హ్యాష్‌ట్యాగ్‌తో తన ప్రేమను వ్యక్తం చేశారు. తండ్రిగా తన కుమార్తెపై ఉన్న ప్రేమను ఈ చిన్న మాటల్లో ఎంతో అందంగా తెలియజేశారు. ఈ పోస్ట్ షేర్ చేసిన కొద్ది సమయంలోనే అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఇప్పటికే ఈ ఫొటోకు 3 లక్షలకు పైగా లైక్స్ వచ్చాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు అల్లు అర్హాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అల్లు అర్జున్‌కు సంబంధించిన ఈ ఫ్యామిలీ పోస్ట్ అభిమానులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. తెరపై స్టైలిష్ స్టార్‌గా, మాస్ హీరోగా కనిపించే బన్నీ.. వ్యక్తిగత జీవితంలో తన పిల్లలతో ఎంతో ప్రేమగా ఉండే తండ్రిగా కనిపించడం అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఇక అల్లు అర్జున్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ఫాంటసీ యాక్షన్ చిత్రం 'రాజా'లో నటిస్తున్నారు. ఈ సినిమాలో దీపికా పడుకొణె కథానాయికగా నటిస్తోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతో పాటు దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో కూడా అల్లు అర్జున్ ఓ సినిమా చేయాల్సి ఉంది. ఇలా వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న బన్నీ.. మరోవైపు కుటుంబానికి కూడా తగినంత సమయం కేటాయిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

## సుకుమార్‌తో రామ్ చరణ్.. రహస్య ప్రదేశానికి చెర్రీ...!



మెగాస్టార్ తనయుడు రామ్ చరణ్ మరో మూవీకి రెడీ అయిపోయారు. ఈ ఏడాది పెద్దితో అలరించిన చెర్రీ.. సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ సినిమా ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ చిత్రాన్ని ప్రస్తుతం ఆర్సీ17 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కించనున్నారు. ఈ డిసెంబర్ నుంచే షూటింగ్ సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే రామ్ చరణ్‌కు సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సుకుమార్ మూవీ కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫామ్ అయ్యేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది. దాదాపు మూడు రోజుల పాటు తన లుక్‌ను మార్చుకునేందుకు విరామం తీసుకున్నట్లు సమాచారం. ఎవరికీ తెలియని ఓ సీక్రెట్ లోకేషన్‌లో రామ్ చరణ్ ట్రాన్స్‌ఫార్మేషన్‌కు సిద్ధమవుతున్నారని టాక్. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రైనర్, చెఫ్‌లతో సహాయక సిబ్బంది రామ్ చరణ్‌తోనే ఉండనున్నారు. ఈ మూవీ కోసం రామ్ చరణ్ పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా కోసం పెద్ది సినిమాలోని లాంగ్ హెయిర్‌ను వదిలేసి లావుతగ్గడం మొదలట్టారు. తాజాగా రామ్ చరణ్ ఎయిర్‌పోర్ట్‌లో వెళ్తున్న వీడియా సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. రంగస్థలం తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న మూవీ కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి



M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.